

ఇంటర్‌లో బాలికల హవా



బాలురు కంటే రెండు శాతం అధికంగా ఉత్తీర్ణత

- ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లాకు నాలుగో స్థానం
- ప్రథమ సంవత్సరం 77 శాతం, ద్వితీయ సంవత్సరంలో 84 శాతం పాస్
- ఒకేషనల్... ప్రథమ ఏడాది 68 శాతం, ద్వితీయ ఏడాది 80 శాతం ఉత్తీర్ణత

విశాఖపట్నం/మద్దిలపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈ ఏడాది కూడా బాలికల హవా కొనసాగింది. బాలురు కంటే రెండు శాతం అధికంగా బాలికలు ఉత్తీర్ణుల య్యారు. ప్రథమ సంవత్సరంలో 77 శాతం, ద్వితీయ సంవత్సరంలో 84 శాతం ఉత్తీర్ణతతో విశాఖ జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది. గత ఏడాది కంటే ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఒక మెట్టు (గత ఏడాది రాష్ట్రంలో ఐదో స్థానం), ద్వితీయ సంవత్స రం ఫలితాల్లో రెండు మెట్లు (గత ఏడాది ఆరో స్థానం) ఎగబాకింది.



పునర్విభజన తరువాత తొలిసారి కొత్త జిల్లాల ప్రాతిపదికన ఈ ఏడాది ఫలితాలు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా నుంచి జనరల్ కేటగిరీలో ప్రథమ సంవత్సరం 38,818 మంది విద్యార్థులు పరీక్షలకు ... మిగతా 6వ పేజీలో

ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబిబీఎస్ చేస్తా

శరగడం పావని, బైపీసీ ద్వితీయ సంవత్సరం టాపర్



శరగడం పావని
991/1000

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 12: గాజువాక బీసీ రోడ్డులో నివాసముంటున్న శరగడం నాగ గంగారావు, లావణ్యల కుమార్తె పావని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం (బైపీసీ) 991/1000 మార్కులు సాధించింది. ఈమె కూర్మన్నపాలెం శ్రీచైతన్య కళాశాలలో చదువుకుంది. పావని మొదటి సంవత్సరంలో 435 మార్కులు తెచ్చుకుంది. ద్వితీయ సంవత్సరం ఇంగ్లీషులో 97, సంస్కృతంలో 99, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్ కెమిస్ట్రీల్లో 60/60, ప్రాక్టికల్స్‌లో 120కి 120 మార్కులు సాధించింది. కళాశాల అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణ, సందేహాల నివృత్తి, సమాజంలో ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉండాలన్న తల్లిదండ్రుల మార్గనిర్దేశనంతోనే కష్టపడి చదివి ఈ స్థాయి మార్కులు సాధించినట్టు పావని తెలిపింది. భవిష్యత్తులో ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చేసి, ఉత్తమ డాక్టర్ కావాలన్నది తన లక్ష్యమని పేర్కొంది. పావని తండ్రి గంగారావు గంగవరం పోర్టులో పనిచేస్తున్నారు. తల్లి గృహిణి.

ఐఐటీలో ఇంజనీరింగ్ చేస్తా

- చింటు రేవతి,
ఎంపీసీ మొదటి సంవత్సరం టాపర్



చింటు రేవతి
467/470...

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 12: బోయపాలెం శ్రీచైతన్య కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న చింటు రేవతి 467/470 మార్కులు సాధించింది. రేవతి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా కోట బొమ్మాళి మండలం సుబ్బారావుపేట. తల్లిదండ్రులు చింటు కృష్ణమూర్తి, జయమ్మ. సాధారణ రైతు అయిన కృష్ణమూర్తి ఆర్థికంగా అంత స్తోమత లేకపోయినా తనలా తన పిల్లలు ఇబ్బందిపడకూడదన్న ఉద్దేశంతో కష్టపడి చదివిస్తున్నారు. జయమ్మ గృహిణి. చిన్నచిన్న పనులకు వెళుతుంటారు. ఇంటర్మీడియట్ అనంతరం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీలో ఇంజనీరింగ్ చేయాలనేది తన లక్ష్యమని రేవతి చెప్పింది.

టాపర్లుగా విశాఖ విద్యార్థులు

- ఫస్టియర్ ఎంపీసీలో 467 మార్కులు
- సెకండ్ ఇయర్ బైపీసీలో 991 మార్కులు...
- ఇంకా అనేక మందికి 990, 989..
- ఫలితాల్లో ప్రైవేటు జోరు



మేఘదీపక్, 990/1000
ఎంపీసీ ద్వితీయ సంవత్సరం



చింతాడ రిషిత 435/440
ప్రథమ ఏడాది బైపీసీ

విశాఖపట్నం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో విశాఖ విద్యార్థులు మంచి ప్రతిభ చూపారు. జిల్లాలో చదివిన ఇద్దరు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారని ఆయా కళాశాలలు వెల్లడించాయి. కాగా మరికొందరు విద్యార్థులు కూడా మంచి మార్కులు సాధించారు. నగరంలోని శ్రీచైతన్య విద్యా సంస్థల్లో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదివిన విద్యార్థిని చింతు రేవతి 470కి 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించింది. ఇదే విద్యా సంస్థలో ద్వితీయ సంవత్సరం బైపీసీ చదివిన శరగడం పావని 991 మార్కులతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రథమ ఏడాది ఎంపీసీలో నారాయణ కళాశాలకు చెందిన వేంపాడ గణేష్ కార్తీక్, పెయ్యల ఉద్భవ్, ప్రణవ్ సాయినాగ్, పి. హర్షవర్ధన్, సి.భరద్వాజ, పి.సుమన్, ఎల్.మురళి, డి.సాయి సాత్విక్, పి.మహాలక్ష్మి, శ్రీచైతన్య విద్యా సంస్థలకు చెందిన కె.అనిల్‌కుమార్, వి.బెనర్జీనాయుడు, ఎ.మేఘనా శర్మ, శ్రీవిశ్వ విద్యార్థులు జి.ఆదిశేషు, డి.పల్లవి, డి.మునీంద్ర, ఎం.జాహ్నవి, డి.పార్థు, అసెంట్ కళాశాలకు చెందిన సిద్ధార్థరెడ్డిలు 470కి 466 మార్కులు సాధించారు. ప్రథమ ఏడాది బైపీసీలో నారాయణ కళాశాలలకు చెందిన బి.సత్యవేణి, శ్రీచైతన్య కళాశాలలకు చెందిన బాలక హర్షవర్ధన సాయి, చింతాడ రిషితలు 440కి 435 మార్కులు సాధించారు. ద్వితీయ ఏడాది ఎంపీసీలో శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన శెట్టి మేఘదీపక్, డి.ప్రేమచరణ్, ఎం.చరణ్‌లు 990, పి.బాలాజీ, శ్రీమయి, వెంకటపవన్, బి.లోకేష్, మెండ తరుణ్, అసెంట్ కళాశాలలో చదివిన బి.హర్షదీప్ 989 మార్కులు సాధించారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో శ్రీచైతన్య కళాశాలకు చెందిన పి.దాకేశ్, ఆర్.దీపికా కీర్తిలు 989 మార్కులు సాధించారు.

చతికిలపడ్డ ప్రభుత్వ కళాశాలలు

దారుణంగా ఇంటర్ ఫలితాలు

- ప్రథమ సంవత్సరంలో 32%, ద్వితీయ ఏడాదిలో 45 శాతం ఉత్తీర్ణత
- కృష్ణా కళాశాలలో 35.47%
- మహిళా కళాశాలలో 58.9 శాతం ఉత్తీర్ణత
- హైస్కూలు ప్లస్‌లో 278 మంది విద్యార్థులకు 47 మంది పాస్
- కేజీబీవీల్లో 184కి 113 ఉత్తీర్ణత
- ప్రైవేటు కళాశాలల్లో 83.38 శాతం పాస్

విశాఖపట్నం/మద్దిలపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫలితాలు దారుణంగా వచ్చాయి. ప్రథమ సంవత్సరం 32 శాతం, ద్వితీయ సంవత్సరం 45 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించాయి. పాలకుల మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప ఎక్కడా పర్మనెంట్ అధ్యాపకుల నియామకం చేపట్టలేదు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు కూడా అందించలేదు. ఇక నాడు-నేడు పేరుతో ఏడాది పొడవునా కళాశాలల్లో పనులు చేపట్టడంతో బోధనపై ప్రభావం పడింది. దీంతో ఫలితాలు పేలవంగా వచ్చాయని అంటున్నారు.



జిల్లాలో పది జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రథమ సంవత్సరం 1,550 మంది పరీక్షలు రాయగా కేవలం 502 (32 శాతం) మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరం 1,249 మంది పరీక్షలకు హాజరవ్వగా 566 మంది (45 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కోర్సుల్లో కాస్త మెరుగైన ఫలితాలే కనబరిచారు. ప్రథమ సంవత్సరం 1,013 మందికి 655 (64 శాతం), ద్వితీయ సంవత్సరంలో 900 మందికి 703 మంది (78 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

నగరంలోని వీఎస్ కృష్ణా జూనియర్ కళాశాలలో ప్రథమ ఏడాదిలో 481 మందికి 102 మంది (21.21 శాతం), ద్వితీయ ఏడాదిలో 406కి 144 (35.47 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రథమ ఏడాది 455కి 217 (47.69 శాతం), ద్వితీయ ఏడాది 399కి 235 (58.9 శాతం) మంది, ఒకేషనల్‌లో ప్రథమ ఏడాదిలో 212కి 179 (84.43 శాతం), ద్వితీయ సంవత్సరం 192కి 181 (94.27 శాతం) ఉత్తీర్ణతతో మంచి ప్రతిభ చూపారు. ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పనితీరు మరీ తీసికట్టుగా మారింది. ప్రథమ సంవత్సరం 14 మందికి 12 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఒకరు, ద్వితీయ ఏడాది తొమ్మిది మందికిగాను ఏడుగురు పరీక్షలకు హాజరుకాగా ఒకరు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఆ కళాశాల నుంచి ఒక్కొక్క విద్యార్థి మాత్రమే ఉత్తీర్ణత సాధించడంతో కళాశాల జిల్లాలో అట్టడుగు స్థానంలో నిలిచింది.

హైస్కూలు ప్లస్ ధమాల్

జిల్లాలోని ఆరు ఉన్నత పాఠశాలల్లో బాలికల కోసం ఏర్పాటుచేసిన హైస్కూలు ప్లస్‌లో ఫలితాలు నిరాశపరిచాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలిపి 278 మంది పరీక్షలకు హాజరుకాగా కేవలం 47 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ ఏడాది 167 మంది విద్యార్థులకుగాను 25 (14 శాతం) మంది, ద్వితీయ సంవత్సరం 111 మందికి 22 మంది (20 శాతం) మాత్రమే ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. రాంపురం, మల్కాపురంలలో ప్రథమ ఏడాది ఒక్కొక్కరు మాత్రమే పాసయ్యారు. మిగిలిన చోట్ల కూడా ఆశించినంత ... మిగతా 6వ పేజీలో

వైసీపీ టోకెన్లు



డాబాగార్డెన్స్‌లో ప్రచారం సందర్భంగా కార్యకర్తల పేర్లు నమోదుచేస్తున్న యువతి

పంపకాలకు అధికార పార్టీ కొత్త వ్యూహం

- ప్రచారంలో పాల్గొనే కార్యకర్తలకు రూ.వెయ్యి విలువైన టోకెన్ అందజేత
- ఇంటింటికీ వెళ్లినప్పుడు ఓటర్లకు కూడా పంపిణీ
- ఆ ప్రాంతంలో తాము సూచించిన వ్యక్తి వద్దకు వెళ్లి డబ్బులు తెచ్చుకోవాలంటూ వల
- పోలింగ్ ముందు మరోసారి పంపకాలు ఉంటాయట

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వచ్చే ఎన్నికల్లో ఏదో విధంగా గెలుపొందాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు చూస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలు బృందాల కంటికి చిక్కకుండా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు కొత్త దారులు వెదుకుతున్నారు. ప్రచారంలో పాల్గొనేందుకు వచ్చేవారితోపాటు ఇంటింటికీ టోకెన్‌లు పంపిణీ చేయిస్తున్నారు. వాటిని తాము సూచించిన చోట ఇస్తే నగదు తెచ్చుకోవచ్చునని చెబుతున్నారు.

సాధారణ ఎన్నికలు అనేసరికి ప్రధాన రాజకీయ పార్టీల మధ్య హోరాహోరీ పోరు ఉండడం మామూలే. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఎవరికి వారు వ్యూహరచన చేసి అమలు చేస్తుంటారు. అందులో భాగంగానే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు ఎవరి ప్రయత్నాలు వాళ్లు చేసుకుంటారు. నగదు, మద్యం వంటివి పంపిణీ చేయడం, ప్రచారంలో పాల్గొనేందుకు వచ్చే మహిళలు, పురుషులకు నగదు, బిర్యానీ, మద్యం అందజేయడం సర్వసాధారణంగా మారిపోయింది. కానీ తాజా ఎన్నికల్లో నగదు, మద్యం పంపిణీని అడ్డుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కఠినమైన నిబంధనలు విధించడంతో పాటు నిశిత పర్యవేక్షణ, నిఘా ఉండేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసింది. నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం తరలించినా, ఎక్కడైనా పంపిణీ చేస్తున్నారని దాడులు చేసి కేసులు నమోదుచేయాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో వైసీపీ నేతలు ఓటర్లను ఆకర్షించేందుకు కొత్త వ్యూహం అమలుచేస్తున్నారు. ఇంటింటి ప్రచారం పేరుతో డబ్బులిచ్చి మహిళలు, పురుషులను భారీగా సమీకరిస్తున్నారు. ప్రచారంలో పాల్గొంటున్న వారికి గతంలో మాదిరిగా అక్కడికక్కడే నగదు, మద్యం అందజేయడం లేదు. ప్రత్యేకంగా ఒకరిని నియమించుకుని ప్రచారానికి వచ్చినవారి పేర్లను నమోదు చేయిస్తున్నారు. అనంతరం వారికి చిన్నపాటి చీటీలపై వైసీపీ ఎన్నికల గుర్తు ఫ్యాన్, సీఎం జగన్ ఫొటోలు ముద్రించి అందజేస్తున్నారు. వాటిని తాము సూచించిన చోటకు తీసుకువెళితే అక్కడున్న వ్యక్తి వాటిని తీసుకుని రూ.1,000 ఇస్తారని చెబుతున్నారు. అలాగే కొన్ని నియోజక వర్గాల్లో ఇంటింటి ప్రచారం పేరుతో వైసీపీ నేతలు ముమ్మరంగా తిరుగుతున్నారు. సందిట్లో సడేమియా అన్నట్టు కొన్ని ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు టోకెన్లు జారీచేస్తున్నారు. వార్డులో తాము సూచించిన వ్యక్తి వద్దకు వెళ్లి ఆ టోకెన్ అందజేస్తే రూ.వెయ్యి ఇస్తారని చెబుతున్నారు. పోలింగ్‌కు నెల రోజులు ముందు మామూలుగానే ఈ మొత్తాన్ని ఇస్తున్నామని, పోలింగ్ తేదీ దగ్గరలో ... మిగతా 6వ పేజీలో

రాగి పిండి కొనుగోలుకు కార్డుదారులు విముఖం


- ఇప్పటివరకూ 14.2 శాతం మాత్రమే పంపిణీ
- పిండి కాల పరిమితి రెండు నెలలే...
- రేషన్ డీలర్లలో ఆందోళన

విశాఖపట్నం/గాజువాక/అక్కయ్యపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల సంస్థ ద్వారా సబ్సిడీపై అందిస్తున్న రాగి పిండి కొనుగోలుకు బియ్యం కార్డుదారులు విముఖత చూపుతున్నారు. రాగి పిండి తీసుకుంటే కార్డుదారుడికి కిలో బియ్యం తగ్గిస్తున్నారు. నగరంలో కొంతమంది మాత్రమే రాగి పిండి వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈ నెల ఇప్పటివరకు కేవలం 14.2 శాతం కార్డుదారులు మాత్రమే రాగి పిండి కొనుగోలు చేశారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా రాగి పిండి కిలో రూ.11కు కార్డుదారులకు అందించాలని ప్రతిపాదించి గత నెల నుంచి అమ్మకాలు ప్రారంభించారు. విశాఖ జిల్లాకు గత నెల 100 టన్నులు సరఫరా చేయగా, కార్డుదారుల నుంచి అనుకున్నంత స్పందన రాలేదు. దీంతో డీలర్ల వద్ద ... మిగతా 6వ పేజీలో



కాలేజీ బస్సు బీభత్సం

- ద్విచక్ర వాహనాలు, కారు, టిఫిన్ సెంటర్ వ్యాన్‌పైకి దూసుకుపోయిన వైనం
- బాలుడు మృతి, పది మందికి గాయాలు
- అత్యధికులు పెందుర్తి ప్రాంతానికి చెందినవారు



అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం వద్ద శుక్రవారం ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు బీభత్సం సృష్టించింది. అతివేగంగా మూడు ద్విచక్ర వాహనాలు, కారు, టిఫిన్ సెంటర్ వ్యాన్‌పైకి దూసుకుపోవడంతో పెందుర్తి ప్రాంతానికి చెందిన బాలుడు మృతిచెందాడు. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. - వివరాలు II పేజీలో

ఆదాయ శాఖలకు మినహాయింపు లేదా!?

అందరికీ ఎన్నికల విధులు

- ఇలా ఎన్నడూ లేదని ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, దేవదాయ శాఖల సిబ్బంది ఆవేదన
- ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం
- ముందుచూపుతోనే శిక్షణ ఇస్తున్నామంటున్న అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల విధుల నుంచి కొన్ని ప్రభుత్వ శాఖలను మినహాయించడం ఆనవాయితీ. కానీ ఈసారి దానిని పక్కన పెట్టి జిల్లా యంత్రాంగం వ్యవహరిస్తోంది. ఏ శాఖ సిబ్బంది అయినా సరే ఎన్నికల విధులు నిర్వహించాల్సిందేనంటూ పట్టుబట్టి శిక్షణ ఇస్తోంది. దీనిపై పలువురు ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని భావిస్తున్నారు.

సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తెచ్చి పెట్టే శాఖలను ఎన్నికల విధుల నుంచి మినహాయిస్తారు. కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, ట్రెజరీలు, దేవదాయ శాఖ, గనుల శాఖ, రవాణా శాఖ ఈ కోవలోకి వస్తాయి. ప్రభుత్వానికి ఆదాయం ముఖ్యం కాబట్టి, ఈ శాఖల్లో అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటే...ఆ మేరకు ఆదాయం తగ్గే అవకాశం ఉన్నందున వారిని ఆయా విధుల నుంచి మినహాయించడం ఆనవాయితీగా వస్తోంది. ఆయా శాఖల సిబ్బంది కూడా తమ పరిస్థితి వివరిస్తూ, ప్రభుత్వానికి తమ వల్ల ఫలానా ఆదాయం వస్తున్నందున, తమను మినహాయించాలని లేఖ రాస్తారు. దానిని పరిశీలించి మినహాయింపు ఇస్తారు. అటువంటివారు ఎన్నికల శిక్షణ, పోలింగ్, కౌంటింగ్ విధులకు వెళ్లనవసరం లేదు. ఈసారి ఆ విధంగా కమర్షియల్ ట్యాక్స్ ట్రెజరీస్ సిబ్బంది లేఖ రాసి మినహాయింపు పొందినట్టు సమాచారం. మిగిలిన వారు లేఖలు రాసి, అనుమతి తెచ్చుకునేలోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ ప్రక్రియ అక్కడితో ఆగిపోయింది. దాంతో ఆ రెండు శాఖలను మినహాయించి మిగిలిన శాఖల సిబ్బంది అందరికీ దశల వారీగా ఎన్నికల శిక్షణ ఇస్తున్నారు. అదేవిధంగా శుక్రవారం కూడా ఈ శిక్షణకు ఆదాయం సాధించే సంస్థల అధికారులు హాజరయ్యారు. వారు జిల్లా ఎన్నికల అధికారికి పరిస్థితిని వివరిస్తే...ముందు చూపుతో శిక్షణ ఇస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఉపయోగించుకోబోమని హామీ ఇచ్చారు. రిజర్వ్‌లో కొంతమంది ఉండాలి కాబట్టి అందరికీ శిక్షణ ఇస్తున్నామని సర్ది చెప్పారు.

అనారోగ్య కారణాలతో డుమ్మాకు యత్నం

ఇదిలావుండగా పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు ఎన్నికల విధుల నుంచి ... మిగతా 6వ పేజీలో

సాహితీ ఫార్మా ప్రమాదంపై గూడుపుఠాణి

- పది నెలలైనా అందని నివేదిక
- ప్రమాదంలో ఆరుగురి మృతి
- మనిషికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వకుండా నాటకం
- రూ.9 లక్షలు ఇస్తామంటున్న యాజమాన్యం
- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన ప్రజా శాస్త్రవేత్తల బృందం



సాహితీ ఫార్మాలో ప్రమాద దృశ్యం (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఆర్థిక మండలిలోని సాహితీ ఫార్మా కంపెనీలో పది నెలల క్రితం సంభవించిన ప్రమాదంపై గూడుపుఠాణి నడుస్తోంది. ఇన్నాళ్లయినా వాస్తవాలు వెలుగు చూడలేదు. గత ఏడాది జూన్‌లో సదరు కంపెనీలో రీబాయిలర్ పేలి పది రోజుల వ్యవధిలో ఆరుగురు కార్మికులు చనిపోయారు. ఫార్మా ప్రమాదాల్లో చనిపోతే రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ఇస్తున్నారు. కానీ ఈ కంపెనీలో అలా ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఒక్కో కార్మికుడికి రూ.25 లక్షల పరిహారం ప్రకటించింది. ఆ తరువాత లోపాయికారీగా ఆ కంపెనీ ద్వారానే ఆ సొమ్ము పంపిణీకి ఏర్పాట్లు చేసింది. కానీ కంపెనీ యాజమాన్యం...తాము చాలా నష్టపోయామని, ఎక్కువ మొత్తం ఇవ్వలేమంటూ కార్మిక సంఘాలను మచ్చిక చేసుకొని, మృతుల కుటుంబాలకు రూ.9 లక్షలు చొప్పున ఇవ్వడానికి ఒప్పందాలు చేసుకుంది. దీనిపై ప్రజా శాస్త్రవేత్తల బృందం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ఫార్మా కంపెనీలు నైపుణ్యం కలిగిన వారిని తీసుకోవడం లేదని, అన్‌స్కిల్డ్ కార్మికులను పెట్టుకొని నిర్వహించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ... మిగతా 6వ పేజీలో

ఘనంగా ఐఎస్‌టీడీ వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న లోకల్ ఐఎస్‌టీడీ చైర్మన్ డా.ఓఆర్‌ఎం.రావు

కంచరపాలెం, ఏప్రిల్ 12 : ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) 54వ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ డా.కె.వి. రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో లోకల్ ఐఎస్‌టీడీ చైర్మన్ డా.ఓఆర్‌ఎం.రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.రావు మాట్లాడుతు ఐఎస్‌టీడీలో ప్రతి ఒక్కరు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందులో సభ్యత్వం పొందడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ మాట్లాడుతు గతేడాది నిర్వహించిన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ డే ప్రోగ్రాంనకు జాతీయ స్థాయిలో తమ కళాశాలకు ద్వితీయ బహుమతి పొందడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో డా.బీవీ లక్ష్మణరావు, సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ ఎ.వరహాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో వైజాగ్ ఎన్‌ఆర్‌ఐ కాలేజీ విజయపథం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు విజయపరంపర కొనసాగించినట్టు వైజాగ్ ఎన్‌ఆర్‌ఐ విద్యా సంస్థల సీఈవో ఎం.రాంబాబు అన్నారు. ప్రథమ సంవత్సరం నుంచి ఇంటర్, మెడికల్, ఇంజనీరింగ్ పోటీ పరీక్షల్లో వరుసగా 14 ఏళ్ల పాటు అత్యుత్తమ ఫలితాలను కొనసాగిస్తోందన్నారు. ఈ ఏడాది విశాఖలో జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 465, 465, 465, 464, 464, 464,463, 463 మార్కులతో తమ విద్యార్థులు సత్తాచాటారన్నారు. బైపీసీలో 434, 434, 433, 433 మార్కులు సాధించారని తెలిపారు. ఎంపీసీలో 460కి పైగా మార్కులు 48 మంది సాధించారన్నారు. బైపీసీలో 430 పైగా 32 మందికి వచ్చాయన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 989, 988, బైపీసీ విభాగంలో 988, 987, 986, 986, 985, 984 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించిన విద్యార్థులకు, ఇందుకు కృషి చేసిన అధ్యాపక సిబ్బందికి విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీకి 31వ వార్డు అధ్యక్షుడు రాజీనామా


రాజీనామా చేసిన నాగరాజు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 12: జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని వైసీపీ కీలక నేతలు ఒక్కొక్కరిగా రాజీనామా బాట పడుతున్నారు. శుక్రవారం 31వ వార్డుకు చెందిన ఆ పార్టీ అధ్యక్షులు బత్తిన నాగరాజు రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, వార్డు అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ ఈ లేఖను పార్టీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లగా 31వ వార్డులో పార్టీ బలోపేతానికి కష్టపడ్డానన్నారు. అయితే, ఇటీవల పరిణామాలతో పార్టీలో తను ఇక ఇమడలేక రాజీనామా చేసినట్టు వివరించారు.

కాంగ్రెస్ సమావేశం రసాభాస


రాష్ట్ర పరిశీలకుడు మనోజ్ చౌహాన్‌ను నిలదీస్తున్న నేతలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 12 : విశాఖ జిల్లా కాంగ్రెస్ కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం రసాభాసగా మారింది. సీనియర్ కార్యకర్తలు, నాయకులను కాదని అప్పుడే వచ్చిన వారికి ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కేటాయించడంపై పార్టీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికల అబ్జర్వర్ మనోజ్ చౌహాన్ హాజరయ్యారు. ఆయన కూర్చున్న వేదిక వద్దకు నాయకులు వెళ్లి తమకు అన్యాయం జరిగిందంటూ నిలదీశారు. ఎంపీ, ఎమ్మెల్యే సీట్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి కాకుండా ఇతరులకుసీట్లు కేటాయించడం దుర్మార్గమన్నారు. అంతే కాకుండా లక్షలాది రూపాయలకు సీట్లను అమ్ముకున్నారని ఆరోపించారు. 123 ఏళ్ల చరిత్ర గల కాంగ్రెస్సా? షర్మిల పార్టీయా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు హైదరాలిసింకా మాట్లాడుతూ సీట్ల కేటాయింపులో మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసిన తమకు మొండిచేయి చూపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇకనైనా మైనార్టీలకు సీటు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రామాయణ, భగవద్గీతపై శిక్షణ


శిబిరంలో పాల్గొన్న సభ్యులు

మురళీనగర్, ఏప్రిల్ 12; ఆర్షవిజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకులు ఎం.వరదరాజులు పర్యవేక్షణలో ఇటీవల దాదాపు వెయ్యి మందికి రామాయణ, భారత భగవద్గీతలపై శిక్షణ అందించారు. వీరంతా గృహిణిలే. పరిషత్ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, వరదరాజుల ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వీరిలో 60 మంది ఇటీవల అయోధ్య రామ మందిరానికి చేరుకుని తొమ్మిది రోజుల పాటు సంపూర్ణ రామాయణం పారాయణం చేసి శుక్రవారం నగరానికి తిరిగి చేరుకున్నట్లు బృందానికి బాధ్యత వహించిన జి.ఉమాదేవి, పిఎస్‌ఎన్.మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్షవిజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో చైర్మన్ వెంకటేశ్వరరావు ఈ మహిళలను అభినందించారు. వీరిని నగరానికి స్వాగతించి సత్కరించారు.

స్వర్ణకారుల అభివృద్ధికి చేయూత

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 12: స్వర్ణకారులరే ముద్ర రుణాలు అధిక మొత్తం మంజూరు చేసి వారికి బ్యాంకు ఆఫ్ ఇండియా విశాఖపట్నం జోనల్ డిప్యూటీ మేనేజర్ జేజేశ్వరరావు చేయూతనందిస్తున్నట్టు స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ కొనియాడారు. శుక్రవారం బదిలీపై ఇండోర్ వెళ్తున్న ఆయనను సంఘం సభ్యులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు ముదపాక రవి, ప్రధాన కార్యదర్శి పెదపూడి బ్రహ్మజీ, కోశాధికారి ఈర్ని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


దక్షిణ నియోజకవర్గంలోని వివిధ పార్టీల నుంచి టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

వైసీపీలో నాయకులకు విలువలేదు

» టీడీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ » దక్షిణ నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నేతలు తెలుగుదేశంలో చేరిక

మహారాణిపేట, ఏప్రిల్ 12: ముఖ్యమంత్రి జగన్ రాజకీయాలను భ్రష్టు పట్టించారని, ఆపార్టీలోని నాయకులకు కార్యకర్తలకు విలువ కల్పించడంలేదని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ సీతంరాజు సుధాకర్ అన్నారు. శుక్రవారంపార్టీ కార్యాలయంలో నిర్వహించిన దక్షిణ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున వివిధ రాజకీయ పార్టీల నాయ కులు , కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సం ద ర్భంగా సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ వైసీపీలో విలువలు లేవని, కార్యకర్తలకు గౌరవం లేదని అన్నారు. అలాగే, అందరూ సమష్టిగా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, ఎంపీ ఎం. శ్రీభరత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గండి బాబ్జీ మాట్లాడుతూ ఇసుక, మద్యం అమ్మకాలతో వచ్చే ఆదాయంతో సంక్షేమ పథకాల బటన్‌లు నొక్కుతున్నారన్నారు. ప్రతి ఒక్కరిపై రూ. నాలుగైదు లక్షల రూపాయలు ఉందన్నారు. మద్యం వి క్రయాల ద్వారా రూ. 1.30 లక్షల కోట్లు రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. టీడీపీకి అండగా నిలిచి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈసమా వేశంలో 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 35 వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, బుచ్చా రామిరెడ్డి, పోలుపల్లి జ్యోతి, చిన్న రహమాన్, పల్లా రాధ, కండిపల్లి సతీష్ కుమార్, చొల్లంగి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కళాశాలలో నిరాశాజనక ఫలితాలు

సీతమ్మధార, ఏప్రిల్ 12: సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్ ప్లస్-2 బాలికల కళాశాలలో నిరాశ జనకమైన ఫలితాలు వచ్చాయి. మొత్తం ఎంపీసీలో 11 మంది, బైపీసీలో 7 మంది మొత్తం 18 మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. అయితే, ఎంపీసీ చదువుతున్న ఐదుగురు ఉతీర్ణత సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మంచిమార్కులు సాధించిన విద్యార్థులకు అభినందించారు.

బుల్లయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

డాక్టర్ లంకపల్లి బుల్లయ్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులో మొత్తం 765 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 61.49 శాతం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉతీర్ణత సాధించారు. దీంతో ప్రిన్సిపాల్ కె. సోమేశ్వరరెడ్డి, అధ్యాపకులు విద్యార్థులకు అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని వారు ఈసందర్భంగా పేర్కొన్నారు.

వైసీపీ పాలన నుంచి ప్రజలను కాపాడుతాం

» ఉత్తర నియోజకవర్గ కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు


46వ వార్డు శాంతినగర్‌లో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 12: వైసీపీ దుర్మార్గ పాలన నుంచి ప్రజలను కాపాడేందుకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఎంతో శ్రమిస్తోందని ఉత్తర నియోజకరవర్గం ఉమ్మడి అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. గ్రేటర్ 46వ వార్డు శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మోపుతున్న అనేక రకాల పన్నులతో రా ష్ట్రంలో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇవన్నీ తొలగిపోవాలంటే కేంద్రంలో మోదీ ప్రధానిగా, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండాలన్నారు. కేం ద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వైసీపీ తమవిగా ప్రచారం చేసుకుంటోందన్నారు. ఈ ప్రజలను అనేక విధాలుగా మోసగిస్తోందన్నారు. రాష్ట్రంలో అవినీతి, అ క్రమాలు పెచ్చుమీరిపోయాయన్నారు. అందుకోసం ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను గుర్తు కమలంపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు బీజేపీ, టీడీపీ అధ్యక్షులు గార ఈశ్వరరావు, పుక్కళ్ల పైడికొండ, 26వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కేవీ కుమార్, మాజీ టీడీపీ అధ్యక్షుడు ఆవాల నారాయణ స్వామి, విశాఖ పార్లమెంటరీ తెలుగు మహిళా కార్యదర్శి యాగాటి ఆదిలక్ష్మి, నాయకులు కొప్పిశెట్టి శంకరరావు, గొలగాని సౌజన్య, ఈతలపాక సుజాత, తోట శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సపర్యలు


గాయపడిన వ్యక్తిని పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

కంచరపాలెం, ఏప్రిల్ 12: జై భారత్ పార్టీ అధ్యక్షుడు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మానవత్వం చాటు కున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి వైద్యసాయం అందించడంలో తోడ్పాటు నందించారు. వివరాలివి.. కంచరపాలెం సన్‌రైజ్ క్లబ్ సమీపంలో జాతీయ రహదారిని దాటుతుండగా ఓ వృద్ధుడిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఆయనకు తలకు గాయమై కింద పడిపోయాడు. దీంతో పలువురు వాహనదారులు క్షతగాత్రుడిని రోడ్డు పక్క పుట్‌పాత్‌పై ఉంచారు. ఇంతలో ఎన్నికల ప్రచారం కోసం కంచరపాలెం ఊర్వశి జంక్షన్ మీదుగా జాతీయ రహదారిలో తన వాహనంలో వెళ్తున్న లక్ష్మీనారాయణ గుర్తించి తన వాహనాన్ని పక్కకు నిలిపి నేరుగా క్షతగాత్రుడి వద్దకు వచ్చి ఆయనకు ధైర్యం చెప్పారు. ఏమీ కాదంటూ 108 వాహనానికి ఫోన్ చేసి అంబులెన్స్ వచ్చినంత వరకు నీరీక్షించి బాధితుడిని తరలించారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తి అధైర్య పడకుండా చెప్పడంతో పాటు పావుగంట వరకు బాధితునితో మాట్లాడారు.

'మెడికల్'పై కమర్షియల్ శాఖ ఘన విజయం


నరేంద్రకు ప్లేయిర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందజేస్తున్న అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఏప్రిల్ 12: వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజనల్ అంతర్ శాఖల క్రికెట్ టోర్నీలో భాగంగా శుక్రవారం రైల్వే గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో కమర్షియల్ శాఖ 121 పరుగుల భారీ తేడాతో మెడికల్ విభాగంపై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కమర్షియల్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లకు 159 పరుగులు చేసింది. కెప్టెన్ డి.నరేంద్రకుమార్ అజేయ అర్ధ సెంచరీతో (60) రిటైర్డ్ కాగా, ఎం.కృష్ణంరాజు (43), లోకేష్ (19 నాటౌట్) రాణించారు. లక్ష్య ఛేదనలో మెడికల్ శాఖ పేలవమైన బ్యాటింగ్‌తో కేవలం 38 పరుగులకు ఆలౌటై భారీ తేడాతో ఓటమి పాలైంది. ఒక్క బ్యాటర్ కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. కమర్షియల్ బౌలర్లలో వైవీ.శశి, రాంకిషోర్, శ్యామ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అర్ధ సెంచరీ చేసిన నరేంద్ర ప్లేయిర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. మరో మ్యాచ్‌లో ఆఫీసర్స్ ఎలెవెన్ ఎనిమిది వికెట్ల తేడాతో కన్‌స్ట్రక్షన్‌పై విజయం సాధించింది. తొలి బ్యాటింగ్ చేసిన కన్‌స్ట్రక్షన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 110 పరుగులు చేయగా, ఆఫీసర్స్ ఎలెవెన్ 12.5 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో కెప్టెన్ అవినాష్ అజేయ హాఫ్ సెంచరీ (55), అశోక్ (24 నాటౌట్) రాణించి జట్టుకు సునాయాస విజయాన్నందించారు.

విశాఖ, కొల్లాం ప్రత్యేక వారాంతపు రైలు

» దువ్వాడ మీదుగా మరికొన్ని ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 12: వేసవి రద్దీని దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, కొల్లాం మధ్య ప్రత్యేక వారాంతపు రైలుతోపాటు వయా విశాఖ, దువ్వాడ మీదుగా మరికొన్ని ప్రత్యేక వారాంతపు రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 08539 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి జూలై 3వతేదీ వరకు ప్రతి బుధవారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుతుంది. తిరిగి ఈనెల 18 నుంచి జూలై 4వతేదీ వరకు ప్రతి గురువారం రాత్రి 7.35కు కొల్లాంలో బయలుదేరి మర్నాడు అర్ధరాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుతుంది.

న్యూ టిన్సుకియా-బెంగళూరు-న్యూ టిన్సుకియా వయా విశాఖ

05952 నంబరు గల రైలు మే రెండు జూన్ 27 వరకు ప్రతి గురువారం సాయంత్రం 6.45 గంటలకు న్యూ టిన్సుకియాలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ, మర్నాడు (మూడోరోజు) ఉదయం 9.00 గంటలకు ఎస్‌ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరిగి మే ఆరు నుంచి జూలై ఒకటో తేదీ వరకు ప్రతి సోమవారం ఉదయం 00.30 (ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటలకు) ఎస్‌ఎంవీ బెంగళూరులో బయలుదేరి మర్నాడు రాత్రి 9.40 గంటలకు విశాఖ, బుధవారం మధ్యాహ్నం 1.15 గంటలకు న్యూ టిన్సుకియా చేరుతుంది.

భువనేశ్వర్-యలహంక-భువనేశ్వర్ వయా దువ్వాడ

02811 నంబరు గల ప్రత్యేక ఏసీ రైలు ఈనెల 13 నుంచి మే 25 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 1.53 గంటలకు దువ్వాడ, అర్ధరాత్రి 11.55 గంటలకు యలహంక చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల 15 నుంచి మే 27 వరకు ప్రతి సోమవారం ఉదయం 5.00 గంటలకు మర్నాడు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది.ఈ సర్వీసులు 16 థర్డ్ ఏసీ కోచ్‌లతో కుర్దారోడ్డు, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, నంద్యాల, ధోనే, ధర్మవరం, సత్యసాయి ప్రశాంతి నిలయం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

హౌరా-యశ్వంతపూర్-హౌరా వయా దువ్వాడ

02863 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 18 నుంచి జూన్ 27 వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 12.40 గంటలకు హౌరాలో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 2.43 గంటలకు దువ్వాడ, అర్ధరాత్రి 12.15 (తెల్లవారితే శనివారం) గంటలకు యశ్వంతపూర్ చేరుతుంది. తిరిగి ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 5.00 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి అర్ధరాత్రి 11.05 గంటలకు దువ్వాడ, మర్నాడు (ఆదివారం) మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరా చేరుతుంది.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు.. పాదచారులకు అవస్థలు

» కంచరపాలెం మెయిన్ రోడ్డుకు ఇరువైపులా సమస్య

కంచరపాలెం, ఏప్రిల్ 12 : కంచరపాలెం మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అసలే నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే మెట్టు నుంచి ఊర్వశి జంక్షన్ రోడ్డులో పాదచారులకు నడిచే మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. పుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. వివిధ సామగ్రి, దుకాణాలతో నిండిపోతుండడంతో పాదచారులు ప్రధాన రోడ్డుపైనే నడవాల్సి వస్తోంది. ఫలితంగా నిత్యం పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మెట్టు బస్టాప్ దగ్గర నేతాజీ క్లబ్‌ను ఆనుకుని ఉన్న దుకాణాల వద్ద పరిస్థితి మరీదారుణంగా మారింది. ఇక్కడ పుట్‌పాత్‌పై పూర్తిగా శీతలపానీయాల దుకాణాలు పెట్టి దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారు. పుట్‌పాత్‌లపై దుకాణాలకు కొందరు అద్దెలు వసూలు చేసి సొమ్ములు చేసుకుంటున్నారు. ఏదిఏమైనా పాదచారులుకు ప్రమాదాల జరగకుండా ఏర్పాటు చేసిన పుట్‌పాత్‌లు ఇలా చిల్లర వ్యాపారులతో ఆక్రమణకు గురికావడంపై ప్రజలు ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ, పోలీస్ అధికారులు చర్యలు చేపట్టి ఆక్రమణలకు తొలగించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు


పుట్‌పాత్‌లపై దుకాణాలు

వైసీపీ నేతలకు డిపాజిట్లు దక్కవు

» ట్విట్టర్‌లో వైవీ సుబ్బారెడ్డి విమర్శలపై గంటా ధ్వజం



విశాఖపట్నం, ఏప్రిల్ 12: తాను నియోజకవర్గం మారడం, అభివృద్ధి తదితర అంశాలపై రాజ్యసభసభ్యుడు, వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని, వారి పార్టీలోనే ఎంతమంది ఎమ్మెల్యేలను స్థానాలు మార్చి పోటీ చేయిస్తున్నారో ఆయనకు తెలియదా.. అని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్ వేదికగా నిలదీశారు. వైసీపీ నేతలు ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తే వారికి డిపాజిట్లు రాకుండా ఘోర ఓటమి పాలవుతారని హెచ్చరించారు. ఎవరు ఎక్కడ నుంచి పోటీ చేస్తున్నారన్నది సమస్యకాదని, ప్రజలకు ఎంతవరకు సేవచేస్తున్నాం.. మనల్ని గెలిపించిన ప్రాంతాన్ని ఏమేరకు అభివృద్ధి చేశామన్నదే ముఖ్యమన్నారు. 2014లో తాను భీమిలి నుంచి పోటీ చేశానని, అది పార్టీ అధిష్టానం నిర్ణయంతో జరిగిందని, 2019లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తనను విశాఖ నార్త్ నుంచి పోటీ చేయాలని ఆదేశించడంతో అక్కడ నుంచి పోటీ చేసి విజయం సాధించినట్టు తెలిపారు. ఈ ఎన్నికల్లో పొత్తులో భాగంగా విశాఖ నార్త్ స్థానాన్ని బీజేపీకి కేటాయించడం, తనకు భీమిలి కేటాయించినట్టు పేర్కొన్నారు. రాజకీయ పరిస్థితుల్లో ఎన్ని జరిగినా తాను భీమిలిని ఎంత అభివృద్ధి చేశానన్నది ప్రజలందరికీ తెలుసునని, ఇక్కడ ఎన్నికల ప్రచారాల్లో ఆ నియోజకవర్గ ప్రజల నుంచి వచ్చిన స్పందన చూస్తే ఈవిషయం అర్థమవుతుందని పేర్కొన్నారు. మండల, గ్రామ స్థాయి వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారని, ఇది భీమిలి నియోజకవర్గ ప్రజలకు టీడీపీపై ఉన్న అభిమానమని పేర్కొన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానని ఆయన గుర్తు చేశారు. విశాఖను రాజధానిగా చేస్తామని ప్రకటించి దీన్ని అభివృద్ధి చేయకపోగా, ఇక్కడి భూములు జగన్మోహన్ రెడ్డి అండతో కబ్జాలు చేయలేదా అని గంటా ప్రశ్నించారు.

ఇంటర్‌లో బాలికల హవా

... 5వ పేజీ తరువాయి

హాజరుకాగా 30,050 మంది (77 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 20,745 మందికి 15,858 మంది (76 శాతం), బాలికలు 18,073 మందికి 14,192 మంది (79 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 34,672 మంది పరీక్షలు రాయగా 29,258 మంది (84 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 18,436 మందికి 15,392 (83 శాతం), బాలికలు 16,236 మందికి 13,866 మంది (85 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్..ప్రథమ ఏడాది 1,431 మంది పరీక్షలు రాయగా 968 మంది (68 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 451 మందికి 209 మంది (46 శాతం), బాలికలు 980 మందికి 759 మంది (77 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఏడాది 1,307 మంది పరీక్షలకు హాజరవ్వగా 1041 మంది (80 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 393 మందికి 263 మంది (67 శాతం), బాలికలు 914 మందికి 778 మంది (85 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

చతికిలపడ్డ ప్రభుత్వ కళాశాలలు

... 5వ పేజీ తరువాయి

ఫలితాలు రాలేదు. జిల్లాలో ఆనందపురం, పద్మనాభం, భీమిలి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఫలితాలు కొంతమేర పర్వాలేదనిపించాయి. మూడుచోట్ల కలిపి ప్రథమ ఏడాదిలో 94కి 60, ద్వితీయ ఏడాదిలో 90కి 53 మంది ఉత్తీర్ణత సాధించారు. సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలల్లో ప్రథమ ఏడాదిలో 155కి 110 మంది (70.38), ద్వితీయ ఏడాది 173కి 135 (78.06 శాతం) మంది పాసయ్యారు. గిరిజన సంక్షేమ శాఖలో ప్రథమ ఏడాది 79కి 78 మంది (98.7శాతం), ద్వితీయ ఏడాది 81కి 78 మంది(96 శాతం), బీసీ వెల్ఫేర్‌లో ప్రథమ ఏడాది 92కి 81 మంది (88.04 శాతం), ద్వితీయ ఏడాదిలో 79కి 74కి (93.67 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు కళాశాలల విషయానికి వస్తే ప్రథమ సంవత్సరం 35,897 మంది పరీక్షలు రాయగా 28,778 (80.16 శాతం) మంది, ద్వితీయ సంవత్సరం 32,267కి 27,944 (86.6 శాతం) మంది పాసయ్యారు.

వైసీపీ టోకెన్లు

... 5వ పేజీ తరువాయి

మరోసారి వచ్చి డబ్బులు ఇస్తామని ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఎక్కడా నగదుగానీ, బహుమతులుగానీ నేరుగా పంచడం లేదు కాబట్టి ఎంసీసీ బృందాలు కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండడం లేదని అధికారులు చెబుతున్నారు. నగరంలో కేవలం వైసీపీ నేతలు మాత్రమే ఈ తరహా టోకెన్లు పంపిణీ చేస్తున్నారు.

రాగి పిండి కొనుగోలుకు కార్డుదారులు విముఖం

... 5వ పేజీ తరువాయి

ఎక్కువగా నిల్వలు ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నెలకు సంబంధించి రాగిపిండి కొనుగోలు చేయలేమని డీలర్లు చెప్పినా..పౌర సరఫరాల శాఖ అధికారుల నుంచి ఒత్తిడి వచ్చింది. జిల్లాలో డీలర్లకు 123.166 టన్నుల రాగిపిండి అందజేశారు. దీంతో డీలర్లు బియ్యం కోసం వచ్చే కార్డుదారులకు నచ్చజెప్పి కిలో చొప్పున ఇచ్చారు. జిల్లాలో 5.29 లక్షల కార్డుదారులు ఉండగా గురువారం నాటికి 60,414 మందికి (14.2 శాతం) 60.37 టన్నులు రాగి పిండి విక్రయించారు. ఇంకా రేషన్ డిపోల్లో మరో 60 టన్నుల వరకూ సరకు ఉంది. ఈ నెలకు సంబంధించి 18వ తేదీ వరకు సరకులు పంపిణీకి సమయం ఉంది. అయినా మొత్తం సరకు అమ్మలేమని డీలర్లు అంటున్నారు. కాగా, మార్చి నెలలో సరఫరా చేసిన వంద టన్నుల్లో మిగిలిపోయిన పిండిని ఈ నెలాఖరులోగా విక్రయించాలి. అలాగే ఈనెల వచ్చిన పిండిని వచ్చే నెలాఖరులోగా కార్డుదారులకు సరఫరా చేసేయాలి. లేనిపక్షంలో రాగిపిండి ఎందుకూ పనికిరాకుండా పోతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కిలో బియ్యం తగ్గిస్తామనడం వల్లే కార్డుదారులు ముందుకురావడం లేదని పలువురు వ్యాఖ్యానించారు. సాధారణంగా ఎక్కువ మంది కార్డుదారులు బియ్యం బయట అమ్ముకుంటారు. రాగిపిండి వల్ల ఒక కిలో సొమ్ము కోల్పోవలసి వస్తోందని గాజువాకకు చెందిన కార్డుదారుడొకరు అభిప్రాయపడ్డారు. దీనిపై జిల్లా పౌర సరఫరాల అధికారి గూన సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రతి కార్డుదారుడు రాగిపిండి కొనుగోలు చేసేలా నచ్చజెప్పాలని ఎండీయూలకు సూచించామన్నారు.

ఆదాయ శాఖలకూ మినహాయింపు లేదా!?

... 5వ పేజీ తరువాయి

తప్పించుకోవడానికి రకరకాలు ఎత్తుగడలు వేస్తున్నారు. ఆరోగ్యం బాగా లేదని కొందరు, తండ్రికి సీరియస్‌గా ఉందని మరికొందరు, తల్లికి ఆపరేషన్ అయిందని మహిళలు, డయాలసిస్ చేయించుకోవాలని పలువురు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని కోరుతున్నారు. ఇక్కడ కూడా రాజకీయ సిఫారసులు ఉన్నవారికే మినహాయింపు లభిస్తోంది. మిగిలిన వారికి డ్యూటీ చేయాల్సిందేనని స్పష్టంచేస్తున్నారు. ఇలా మినహాయింపులు తీసుకునేవారి సంఖ్య పెరుగుతుండడం వల్ల ఆదాయం తెచ్చే శాఖల సిబ్బందికి కూడా ముందుచూపుతో శిక్షణ ఇవ్వాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు.

ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళతాం

ఏపీ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం

కేంద్ర ఎన్నికల పరిశీలకుడిని కలవడానికి విశాఖపట్నం వచ్చిన ఎల్‌వీ సుబ్రహ్మణ్యం నోవాటెల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ శాఖల అంశాన్ని ప్రస్తావించారు. ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, దేవదాయ శాఖల సిబ్బందిని కూడా ఎన్నికల విధులకు వేస్తున్నట్టు తమకు ఫిర్యాదులు అందాయని, వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

సాహితీ ఫార్మా ప్రమాదంపై గూడుపుఠాణి

... 5వ పేజీ తరువాయి

పిటిషన్ వేసింది. ప్రమాదం జరిగినప్పుడు వారికి సరైన పరిహారం కూడా ఇవ్వడం లేదని వాదించింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులతో ఒక కమిటీని వేసినా ఇప్పటివరకు ఆ కమిటీ ప్రమాదానికి కారణాలు వెల్లడించలేదని, ఇది చాలా అన్యాయమని శాస్త్రవేత్త బాబూరావు ఆరోపిస్తున్నారు. ఆ ప్రమాదం తరువాత ఉమ్మడి విశాఖ జిల్లాలో మరో నాలుగు ప్రమాదాలు జరగడం గమనార్హం.

సాహితీ ఫార్మాలో రియాక్టర్ పేలడం వల్లే ప్రమాదం జరిగిందని జిల్లా అధికారులు చెబుతున్నారు. దీనిని ప్రజా శాస్త్రవేత్తల బృందం తీవ్రంగా ఖండిస్తోంది. రసాయనాలను శుద్ధి చేసే సాహితీ ఫార్మాలో రియాక్టర్లు ఉండవని, రసాయనాలను వేడి చేయడానికి ఉపయోగించే రీబాయిలర్‌లో ప్రమాదం జరిగిందని పేర్కొంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదించింది. సాహితీ ఫార్మాలో అంతకు ముందు కూడా ఒకసారి ప్రమాదం జరిగిందని, అయినా ఆ సంస్థ యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోలేదని ఎన్‌జీటీకి వివరించారు. ఈ ప్రమాదంపై అనకాపల్లి కలెక్టర్, ఫ్యాక్టరీస్ డైరక్టర్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన నివేదిక అందిందని, అయితే నిపుణులతో కూడిన కమిటీని కూడా నియమించారని, ఆ కమిటీ ఇంకా నివేదిక ఇవ్వకపోవడం దారుణమని శాస్త్రవేత్త బాబూరావు ఆరోపించారు. తక్షణమే ఈ కేసులో బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేందుకు జిల్లా అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

పెందుర్తి రైతుబజార్ విస్తరణ కలేనా?

- స్థలం లేక తీరని పార్కింగ్ సమస్య
- నేలమీదనే కూరగాయాల విక్రయాలు
- గిరిజన ఉత్పత్తులకు ప్రత్యేక స్టాల్ లేదు
- శీతలీకరణ సదుపాయమూ కరవు
- సుజాతనగర్‌లో రైతుబజార్ ఏర్పాటెన్నడో


పెందుర్తి రైతు బజారు

పెందుర్తి, ఏప్రిల్ 12: పెందుర్తిలో రైతుబజార్ అవసరాలకు తగ్గట్టుగా విస్తరణ జరగకపోవడంతో క్రయ, విక్రయదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రైతుబజారుకు రోజూ సుమారు మూడు వేల మంది కొనుగోలుదారులు వస్తుంటారు. 90 స్టాల్స్‌లో 250 క్వింటాళ్ల కూరగాయలు రోజూ విక్రయాలు సాగుతున్నాయి. 11 మండలాల నుంచి 51 గ్రామాలకు చెందిన 143 మంది రైతులు స్టాల్స్‌లో విక్రయాలుచేస్తారు. ఇత ప్రాధాన్యం ఉన్న రైతుబజార్ ఇప్పటి అవసరాలకు తగ్గట్టు విస్తరణ చేపట్టడంలేదు. దీంతో తిప్పలుతప్పడలేదు. బజారులో సరిపడా స్టాల్స్ లేక నేలపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. రైతుబజార్‌కు ఆటోలు, ఇతర వాహనాల్లో రైతులు కూరగాయలు తెస్తుంటారు. స్థలం ఇరుగ్గా ఉండడం, రద్దీతో ఇబ్బందవుతోంది.

రైతుబజార్‌లో పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రహదారిపై వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. సర్కిల్ రోడ్డు కావడంతో రహదారిని వాహనాలు క్రాస్ చేసే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. స్థల సమస్యతో పార్కింగ్ ఏర్పాటు కావడం లేదు. రైతుబజార్‌లో (కోల్డ్‌స్టోరేజ్) శీతలీకరణ సదుపాయం లేక రైతులు నష్టపోవాల్సి వస్తోంది. గిరిజన కార్పొరేషన్ ఉత్పత్తుల స్టాల్ లేక సేంద్రియ పంట దిగుబడులు లభ్యం కావడంలేదని కొనుగోలుదారులు వాపోతున్నారు. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా ఇక్కడ వసతుల కల్పనపై అధికారులు దృష్టి పెట్టడం లేదు.

సుజాతనగర్‌లో రైతుబజార్ అంతేనా..

ఈ పరిధిలో మరో రైతుబజార్ ఏర్పాటు చేయాలని మూడేళ్ల క్రితం ప్రతిపాదించారు. ఇందుకోసం సుజాతనగర్‌లో రూ.కోటితో శీతలీకరణ రైతుబజార్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. గత ప్రభుత్వంలో విశాఖ మార్కెట్ కమిటీ పాలకవర్గం సుజాతనగర్‌లో రైతుబజార్ ఏర్పాటుకు తీర్మానించి స్థలాన్ని ఎంపిక చేసింది. మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఈ స్థలంలో నమూనాలు సేకరించారు. కాగా ప్రతిపాదిత స్థలం సమీపంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు చేపడుతున్న ఓ వ్యాపారి నిర్మాణ సామగ్రి స్టాక్‌పాయింట్‌గా స్థలాన్ని వినియోగిస్తున్నారు. దీనిపై వివాదాలు తలెత్తడంతో అప్పటి ఆర్డీవో తేజ్‌భరత్ పరిశీలన చేశారు. స్థలం వివాదాస్పదంగా మారడంతో రైతుబజార్ ఏర్పాటు ఆదిలోనే నిలిచిపోయింది. కాగా ఈ స్థలాన్ని గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ నిర్వాహకులు తమ అధీనంలోకి తెచ్చుకుని నిర్మాణాలు చేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ స్థితిలో ప్రతిపాదిత స్థలాన్ని సర్వే చేసి, రైతుబజార్ ఏర్పాటుకు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు

ఎన్నికల్లో కూటమి ప్రభంజనాన్ని అడ్డుకోలేరు

- గాజువాక తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు


76వ వార్డులో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఏప్రిల్ 12: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభంజనాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుర్మార్గ వైసీపీ పాలన అంతమయ్యేందుకు ప్రతి ఒక్కరు ఎదురు చూస్తున్నారన్నారు. కూటమి ప్రభంజనాన్ని అడ్డుకోలేరని, రానున్నది ప్రజా సంక్షేమ పాలన అని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు మళ్లీ స్వర్ణయుగం తెస్తారన్నారు. గాజువాక జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ పాలనలో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వైసీపీ నేతలే బాగుపడ్డారన్నారు. బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ కేంద్ర పథకాలను తమవిగా ప్రచారం చేసుకొని జగన్ మోసం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, పులి వెంకటరమణారెడ్డి, నమ్మి అప్పారావు, పెరుమాళ్లు, కోన చినఅప్పారావు, దాసరి జ్యోతి, గడసాల అప్పారావు, ముమ్మన మురళి, తదితరులు పాల్గొన్నారు.

కాకి గోవిందరెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేత

- పల్లా విజయానికి కృషి చేస్తానన్న కార్పొరేటర్


కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 12: గ్రేటర్ 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డిపె సస్పెన్షన్‌ను ఎత్తివేసినట్టు టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ శుక్రవారం ప్రకటించడంతో ఆ వార్డులో సందడి నెలకొంది. టీడీపీ నుంచి 69వ వార్డు కార్పొరేటర్ ఎన్నికైన గోవిందరెడ్డి జీవీఎంసీలో ఫ్లోర్‌లీడర్ పదవి ఆశించారు. పార్టీ అధిష్ఠానం పీలా శ్రీనివాసరావుకు ఆ పదవిని అప్పగించడంతో అప్పటి నుంచి కౌన్సిల్‌లో తటస్థంగా ఉంటూ వచ్చారు. పార్టీ కార్యక్రమాలకు కూడా దూరం కావడంతో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గోవిందరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్నా, గోవిందరెడ్డితోపాటు అతని వర్గీయులు తటస్థంగా ఉన్నారు. దీంతో అతనిపైనున్న సస్పెన్షన్ ఎత్తివేయడంతో గోవిందరెడ్డి అనుచరులతో పాటు టీడీపీ, జనసేన కార్యకర్తల్లో సందడి నెలకొంది. సస్పెన్షన్ ఎత్తి వేయడంపై గోవిందరెడ్డి ఆనందం వ్యక్తంచేశారు. పార్టీ అభివృద్ధికి, గాజువాక కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు విజయానికి తాను పూర్తి స్థాయిలో కృషిచేస్తానని స్పష్టంచేశారు. ఈనెల 14న విశాఖ వస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును స్వాగతించేందుకు వెయ్యి వాహనాలతో ర్యాలీగా వెళ్తామని ప్రకటించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసీపీ పాలన


వెంకటాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్


వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

వైసీపీ పశ్చిమ అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం, ఏప్రిల్ 13: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే వైసీపీ ధ్యేయమని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్ అన్నారు. 92వ వార్డు వెంకటాపురంలో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి వైసీపీ అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఏడాది కాలంలో ప్రతి సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ రెహమాన్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, పేడాడ రమణికుమారి, వార్డు వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ఆర్పీపేట, (కంచరపాలెం): ఆరోగ్యమే ప్రధానమని పశ్చిమ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద కుమార్ అన్నారు. జీవీఎంసీ 57వార్డు పరిధి ఆశవాని పాలెం ఆదారి తులసీరావు ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. కళ్ల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. శిబిరంలో 150 మంది పాల్గొనగా, 45మందికి కంటి ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. 55మందికి కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. రోగులకు ఆనందకుమార్ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ముర్రువాణి నానాజీ, పిన్నింటి అప్పలరాజు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు టీడీపీ కాలనీలో వైసీపీ పశ్చిమ అభ్యర్థి ఆదారి ఆనందకుమార్ పర్యవేక్షణలో ఆదారి తులసీరావు (ఏటీఆర్) ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఎలమంచిలి మునిసిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి సమస్య ఉన్న ప్రజలంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అలాగే, రోగులకు ఉచితంగా ఆపరేషన్లు, మందులు, కళ్లద్దాలు పంపిణీ చేయనున్నారన్నారు. అనంతరం వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆనంద్ కుమార్ విజయానికి ప్రజలందరూ సహకరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యర్రమంలో భీశెట్టి గణేశ్, మహీనమ్మ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దారుణ ఫలితాలు



గోపాలపట్నం జెడ్పీ బలికోన్నత పాఠశాలలోని ప్లస్ టూ కళాశాల

గోపాలపట్నం, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫలితాలు ఆశాజనకంగా లేవు. కొన్నింటిలో దారుణ ఫలితాలు రాగా, మరికొన్నింటిలో దాదాపు సగానికి మందికిపైగా విద్యార్థులు ఫెయిలయ్యారు. గోపాలపట్నం జడ్పీ బాలికోన్నత పాఠశాలలోని ప్లస్ టూ కళాశాలలో ఈ ఏడాదీ ఆశించిన ఫలితాలు రాలేదు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో 27 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకాగా ఏడుగురు, బైపీసీలో 28 మందికి ఏడుగురు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 14 మందిలో ఒకరు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో 14 మందికి ఇద్దరు పాస్ అయ్యారు. రెండేళ్ల కిందట ఈ పాఠశాలలో ప్లస్‌టూ ఏర్పాటు చేశారు. 32 మంది విద్యార్థులు 2022లో చేరారు. 2023 ఇంటర్ ఫలితాల్లో ఒక్కరు మాత్రమే పాస య్యారు. అప్పట్లో అధ్యాపకులులేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. దీంతో చాలా మంది మొదటి సంవత్సరం చదివి వెళ్లిపోయారు. తర్వాత 2023లో 28 మంది చేరారు. ఈ ఏడాదిలో అధ్యాపకులను భర్తీ చేసినా ఫలితాలు మాత్రం నిరాశ కలిగించాయి.

మేహాద్రిగెడ్డ గురుకుల పాఠశాలలో..

మేహాద్రిగెడ్డ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 54 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకాగా, 35 మంది ఉత్తీర్ణతతో 64 శాతం నమోదు చేశారు. ద్వితీయ సంవత్సరంలో 65 మందికి 48 మంది ఉత్తీర్ణతతో 73 శాతం ఫలితాలు వచ్చాయి.

మల్కాపురం ప్రభుత్వ బాలికల కళాశాలలో

మల్కాపురం: మల్కాపురం ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్ ఫలితాలు దారుణంగా ఉన్నాయి. ప్రథమ సంవత్సరం బైపీసీలో నలుగురు పరీక్ష రాయ గా, ఒక్కరు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో నలుగురు పరీక్ష రాయగా, మొత్తం ఫెయిల్ అయ్యారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ ఏడుగురు పరీక్ష రాయగా, ఒక్కరు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో ఆరుగురుకు ఇద్దరు ఉత్తీర్ణత చెందగా, నలుగురు ఫెయిలయ్యారు. ఇక మల్కాపురం ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ ఆరుగురు పరీక్షరాయగా, ముగ్గురు ఉత్తీర్ణత సాధించారు. బైపీసీలో ఇద్దరురాయగా, ఒక్కరు కూడా పాస్ కాలేదు. సీఈసీలో తొమ్మిదిమందికి నలుగురు ఉత్తీర్ణత సాధించారు. హెచ్‌ఈసీ నలుగురుకు ఒక్కరు కూడా పాస్ కాలేదు. ఫస్ట్‌ఈయర్ ఎంపీసీ 8 నుంచి పరీక్ష రాయగా ఒక్కరు మాత్రమే పాస్ అయ్యారు. బైపీసీ నుంచి 10 మందిలో ఒక్కరు పాస్ అయ్యారు. సీఈసీలో 21 మందికి ముగ్గురు ఉత్తీర్ణత సాధించారు.

పెందుర్తిలో 32శాతం ఉత్తీర్ణత

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ఫలితాల్లో 32 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 143 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 59 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఎంపీసీలో 57 మందికి 32, బైపీసీలో 40 మందికి 33, సీఈసీలో 29 మందికి 18, హెచ్‌ఈసీలో 22 మందికి 18మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం 25శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో 184 మందిలో 47 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంత తక్కువ శాతం ఉత్తీర్ణత సాధనపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

అగనంపూడి కళాశాల విద్యార్థులు మెరుగైన ప్రదర్శన


సెకెండియర్ టాపర్
ఎస్.పావని (948/1000)

అగనంపూడి, ఏప్రిల్ 26: అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 50 శాతం, రెండో సంవత్సరంలో 62 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ తెలిపారు. తొలి ఏడాది 107 విద్యార్థులకు గాను 54 మంది వి ద్యార్థులు ఉత్తీర్ణులయ్యాలన్నారు. ఎంపీసీ గ్రూపునకు చెందిన ఎన్. విమల (420) మార్కులు సాధించి టాపర్ నిలిచింది. జశ్వంత్ (408) మార్కులతో రెండోస్థానంలో నిలిచినట్టు వెల్లడించారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 66 మంది విద్యార్థులకు గాను 41 మంది ఉత్తీర్ణత పొందారని వెల్లడించారు. 62 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీ చెందిన ఎస్. పావని (948) మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందన్నారు. ఎంపీసీకి చెందిన బి. శ్రావ్య (931) సాధించినట్లు చెప్పారు.

'ఉక్కు'లో అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 12: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య తెలిపారు. అధికారులు, కార్మిక సంఘ నేతలు, ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

పశ్చిమ ఇండియా కూటమి అభ్యర్థి అత్తిలి విమల

మల్కాపురం, ఏప్రిల్ 12: ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఇండియా కూటమి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల అన్నారు. మల్కాపురంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ ఒకే కోవలో నడుస్తున్నాయని, ఆ పార్టీలను గెలిస్తే రాష్ట్రం నాశనమవుతుందన్నారు. బీజేపీ పాలనతో దేశంలో మహిళలకు రక్షణ లేదన్నారు. మద్య నిషేధం చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించి మాట నిలుపుకోలేదన్నారు. గాజువాక నియోజకవర్గం నుంచిపోటీచేస్తున్న మరడాన జగ్గునాయుడు, విశాఖ ఎంపీగా పోటీచేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థులు గెలిపించాలన్నారు. సమావేశంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ మహిళ నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించండి



మాట్లాడుతున్న ఇంటక్ అధ్యక్షుడు రామచంద్రరావు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 12: ఉక్కు ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల జీతాలు రెండు విడతలుగా ఇవ్వటంతోచాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ నెలలో ఇప్పటికే రూ.వెయ్యి కోట్లు ఉక్కు అమ్మకాలు జరిగాయని, కానీ కార్మికుల జీతాలు ఇవ్వటంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందన్నారు. నూతన వేతనాలు దేశంలో అన్ని స్టీల్‌ప్లాంట్‌ల కార్మికులు తీసుకుంటే విశాఖలో మాత్రం కార్మికులకు ఇంకా పాత వేతనాలే ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారు రమణ, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, కొమ్ము ప్రసాద్, ఎస్‌ఏ.నాయుడు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

గాజువాక, ఏప్రిల్ 12: గాజువాకలో పలు చోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాలను స్థానిక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువత పాల్గొన్నారు.

అప్పన్నకు తులసి దళార్చన



సింహాచలం, ఏప్రిల్ 12: వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం సహస్రనామ తులసీ దళార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకవేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన చేశారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో నిత్య కల్యాణం జరిపారు.

సినిమా గైడ్

- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** గోకుల్, శ్రీకన్య, మౌర్య (గోపాలపట్నం) హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **లవ్ గురు :** శారద, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **శ్రీరంగనీతులు :** కిన్నెర, శ్రీ నరసింహ (గోపాలపట్నం),
- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), శ్రీకన్య-1, హెవెన్, సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి),
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి,
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 20, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 24, క్యారెట్ 30, దొండకాయలు 20, బంగాళదుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 148, బరబాటి 24, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 28, దోసకాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 110, పొటల్స్ 64, కీరదోస 20, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 45, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	411
విజయనగరం	415
శ్రీకాకుళం	415

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	115
ఫారం ధర	--	135
విత్ స్కిన్	--	240
స్కిన్‌లెస్	--	250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ప్రధాన కూడలిలో తప్పిన ప్రమాదం


చెట్టునుంచి విరిగిపడి రహదారిపై పడిన కొమ్మ

మల్కాపురం ఏప్రిల్ 12: మల్కాపురం ప్రధాన కూడలిలో శుక్రవారం పెద్ద ప్రమాదం తప్పింది. డివైడర్ మధ్యనున్న చెట్టు కొమ్మ ఒక్కసారిగా కూప్పకూలి రోడ్డుపై పడింది.అయితే, ఆ సమయంలో వాహనదారులు ప్రయాణించకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. వెంటనే జీవీఎంసీ సిబ్బంది స్పందించి రోడ్డుపై ఉన్న కొమ్మను తొలగించారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడికి అభినందనలు


సత్యనారాయణను అభినందిస్తున్న విద్యార్థిసేన, తూర్పు కాపు ప్రతినిధులు

విశాఖపట్నం, ఏప్రిల్ 12: విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన బెవర సత్యనారాయణను ఉత్తరాంధ్ర విద్యార్థిసేన, తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు అతని కార్యాలయంలో కలిసి శుక్రవారం అభినందించారు. ఉత్తరాంధ్ర విద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి, తూర్పు కాపు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మజ్జి అప్పారావు, ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు, న్యాయవాది కె.ఎరుకునాయుడు, సభ్యులు త్రినాథరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం'


గంగవరం పోర్టు ఆందోళనకారులతో మాట్లాడుతున్న గంగారావు

పెదగంట్యాడ, ఏప్రిల్ 12: సమస్యలు సత్వరమే పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని గంగవరం పోర్టు కార్మికుల తరపున జీవీఎంసీ 78వవార్డు కార్పొరేటర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు డాక్టర్ బి.గంగారావు అన్నారు. గంగవరం పోర్టు యాజమాన్యం గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోర్టు గేటు వద్ద ఎంప్లాయిస్ యూనియన్ చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడుతూ పోర్టులో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు ప్రస్తుత నిత్యావసరాల ధరలకు అనుగుణంగా లేవన్నారు. నిత్యం దుమ్ము, ధూళి మధ్య పనిచేయాల్సిన పరిస్థితి ఉందని, అనారోగ్యం పాలైన కార్మికులకు మెరుగైన వైద్య అందించాల్సి ఉందని, ఇందుకోసం కార్మికులు ఆందోళనలు చేయాల్సి రావడం విచారకరమన్నారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల పోర్టు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. కార్మికులకు సంబంధించిన 15 డిమాండ్లు పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.జగన్ పలువురు కార్మికులు ఆందోళనలో పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 103 మంది గీతం విద్యార్థుల ఎంపిక

సాగర్‌నగర్, ఏప్రిల్ 12: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసిస్తున్న 103 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ ఎస్. వంశీకిరణ్ సోమయాజులు తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ స్కూల్ విద్యార్థులకు ప్రముఖ కంపెనీలు ఫెడరల్ బ్యాంక్, డెలాయిట్, ఎసెంచూర్, ఆక్సెన్ పాట్నర్స్, జైడూస్ వెల్‌నెస్, బెర్జర్ పెయింట్స్, ఏసియన్ పెయింట్స్, విప్రో కన్జూమర్‌కౌర్ తదితర సంస్థలు శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఇందులో 103 మంది రూ14. 25 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా కెరీర్ ఫుల్ ఫిల్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ వి. రవికుమార్ మాట్లాడుతూ మరికొన్ని బహుళజాతి సంస్థలు కూడా విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడానికి ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. విద్యార్థులకు కార్పొరేట్ సంస్థల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని గీతం వీసీ ప్రొఫెసర్ దయానందసిద్ధపట్టం, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు అభినందించారు.

గల్లంతైన బీ టెక్ విద్యార్థి మృతదేహం లభ్యం


తేజ మృతదేహం

సాగర్‌నగర్, ఏప్రిల్ 12: రుషికొండ బీచ్‌లో గల్లంతైన బీటెక్ విద్యార్థి తేజ (20) మృతదేహం శుక్రవారం ఉదయం లభ్యమైంది. కంచరపాలెం ఊర్వశి జంక్షన్ ప్రాంతానికి చెందిన తేజ ఐదుగురు స్నేహితులతో కలిసి గురువారం సాయంత్రం రుషికొండ బీచ్‌కు విహారానికి వచ్చి సముద్ర స్నానాలకు దిగి గల్లంతైన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన ప్రాంతానికి కాస్త దూరంలోనే మృతదేహం లభ్యమైంది. ఆరిలోవ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

చురుగ్గా జోనల్ కార్యాలయం ఆధునికీకరణ


ఆర్చ్ నిర్మాణానికి వీలుగా గోడలు తొలగించిన దృశ్యం

వేపగుంట ఏప్రిల్ 12: జీవీఎంసీ 94వ వార్డు పరిధిలోని వేపగుంట జోనల్ కార్యాలయం ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. ఈ కార్యాలయ ముందు భాగంలో కొత్త ఆర్చ్‌తోపాటు అదనపు గదులు, సీలింగ్, విద్యుదీకరణ, అధికారులకు గదుల నిర్మాణం తదితర పనులు కొనసాగిస్తున్నారు. ఈ నిర్మాణాలకు దాదాపు రూ. 65లక్షలు ఖర్చు చేయన్నుట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఇక్కడ ఉన్న కల్యాణ మండపాన్ని అప్పట్లో జోనల్ కార్యాలయంగా మార్చిన విషయం తెలిసిందే. దీంతో కార్యాలయ పేరును సూచించేలా ముందుభాగంలో ఆర్చ్ ఏర్పాట్లు చేయనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు వివరించారు.

బంగారమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

సింహాచలం, ఏప్రిల్ 12 : అడివివరం, విజినిగిరిపాలెం, లండగరువు, తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్యదేవత బంగారమ్మ తల్లి ఆలయాన్ని రూ. 35 లక్షలతో నిర్మించనున్నారు. ఈమేరకు శుక్రవారం శంకువును స్థాపించారు. జూన్‌లో జరిగే అమ్మవారి పండుగ నాటికి ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఘనంగా ఐఎస్‌టీడీ వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న లోకల్ ఐఎస్‌టీడీ చైర్మన్ డా.ఓఆర్‌ఎం.రావు

కంచరపాలెం, ఏప్రిల్ 12 : ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) 54వ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో లోకల్ ఐఎస్‌టిడీ చైర్మన్ డా.ఓఆర్‌ఎం.రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.రావు మాట్లాడుతు ఐఎస్‌టీడీలో ప్రతి ఒక్కరు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందులో సభ్యత్వం పొందడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ మాట్లాడుతు గతేడాది నిర్వహించిన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ డే ప్రొగ్రాంనకు జాతీయ స్థాయిలో తమ కళాశాలకు ద్వితీయ బహుమతి పొందడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో డా.బీవీ లక్ష్మణరావు, సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ ఎ.వరహాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో వైజాగ్ ఎన్‌ఆర్‌ఐ కాలేజీ విజయపథం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు విజయపరంపర కొనసాగించినట్టు వైజాగ్ ఎన్‌ఆర్‌ఐ విద్యా సంస్థల సీఈవో ఎం.రాంబాబు అన్నారు. ప్రథమ సంవత్సరం నుంచి ఇంటర్, మెడికల్, ఇంజనీరింగ్ పోటీ పరీక్షల్లో వరుసగా 14 ఏళ్ల పాటు అత్యుత్తమ ఫలితాలను కొనసాగిస్తోందన్నారు. ఈ ఏడాది విశాఖలో జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 465, 465, 465, 464, 464, 464,463, 463 మార్కులతో తమ విద్యార్థులు సత్తాచాటారన్నారు. బైపీసీలో 434, 434, 433, 433 మార్కులు సాధించారని తెలిపారు. ఎంపీసీలో 460కి పైగా మార్కులు 48 మంది సాధించారన్నారు. బైపీసీలో 430 పైగా 32 మందికి వచ్చాయన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 989, 988, బైపీసీ విభాగంలో 988, 987, 986, 986, 985, 984 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించిన విద్యార్థులకు, ఇందుకు కృషి చేసిన అధ్యాపక సిబ్బందికి విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీకి 31వ వార్డు అధ్యక్షుడు రాజీనామా


రాజీనామా చేసిన నాగరాజు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 12: జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని వైసీపీ కీలక నేతలు ఒక్కొక్కరిగా రాజీనామా బాట పడుతున్నారు. శుక్రవారం 31వ వార్డుకు చెందిన ఆ పార్టీ అధ్యక్షులు బత్తిన నాగరాజు రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, వార్డు అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ ఈ లేఖను పార్టీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా 31వ వార్డులో పార్టీ బలోపేతానికి కష్టపడ్డానన్నారు. అయితే, ఇటీవల పరిణామాలతో పార్టీలో తను ఇక ఇమడలేక రాజీనామా చేసినట్టు వివరించారు.

కాంగ్రెస్ సమావేశం రసాభాస


రాష్ట్ర పరిశీలకుడు మనోజ్ చౌహాన్‌ను నిలదీస్తున్న నేతలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 12 : విశాఖ జిల్లా కాంగ్రెస్ కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం రసాభాసగా మారింది. సీనియర్ కార్యకర్తలు, నాయకులను కాదని అప్పుడే వచ్చిన వారికి ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కేటాయించడంపై పార్టీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికల అబ్జర్వర్ మనోజ్ చౌహాన్ హాజరయ్యారు. ఆయన కూర్చున్న వేదిక వద్దకు నాయకులు వెళ్లి తమకు అన్యాయం జరిగిందంటూ నిలదీశారు. ఎంపీ, ఎమ్మెల్యే సీట్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి కాకుండా ఇతరులకుసీట్లు కేటాయించడం దుర్మార్గమన్నారు. అంతే కాకుండా లక్షలాది రూపాయలకు సీట్లను అమ్ముకున్నారని ఆరోపించారు. 123 ఏళ్ల చరిత్ర గల కాంగ్రెస్సా? షర్మిల పార్టీయా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు హైదరాలిసింకా మాట్లాడుతూ సీట్ల కేటాయింపులో మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసిన తమకు మొండిచేయి చూపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇకనైనా మైనార్టీలకు సీటు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రామాయణ, భగవద్గీతపై శిక్షణ


శిబిరంలో పాల్గొన్న సభ్యులు

మురళీనగర్, ఏప్రిల్ 12; ఆర్షవిజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకులు ఎం.వరదరాజులు పర్యవేక్షణలో ఇటీవల దాదాపు వెయ్యి మందికి రామాయణ, భారత భగవద్గీతలపై శిక్షణ అందించారు. వీరంతా గృహిణిలే. పరిషత్ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, వరదరాజుల అధ్వర్యంలో శిక్షణ పొందిన వీరిలో 60 మంది ఇటీవల అయోధ్య రామ మందిరానికి చేరుకుని తొమ్మిది రోజుల పాటు సంపూర్ణ రామాయణం పారాయణం చేసి శుక్రవారం నగరానికి తిరిగి చేరుకున్నట్లు బృందానికి బాధ్యత వహించిన జి.ఉమాదేవి, పిఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్షవిజ్ఞాన పరిషత్ అధ్వర్యంలో చైర్మన్ వెంకటేశ్వరరావు ఈ మహిళలను అభినందించారు. వీరిని నగరానికి స్వాగతించి సత్కరించారు.

స్వర్ణకారుల అభివృద్ధికి చేయూత

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 12: స్వర్ణకారులరే ముద్ర రుణాలు అధిక మొత్తం మంజూరు చేసి వారికి బ్యాంకు ఆఫ్ ఇండియా విశాఖపట్నం జోనల్ డిప్యూటీ మేనేజర్ జేజేశ్వరరావు చేయూతనందిస్తున్నట్టు స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ కొనియాడారు. శుక్రవారం బదిలీపై ఇండోర్ వెళ్తున్న ఆయనను సంఘం సభ్యులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు ముదపాక రవి, ప్రధాన కార్యదర్శి పెదపూడి బ్రహ్మాజీ, కోశాధికారి ఈర్ని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


దక్షిణ నియోజకవర్గంలోని వివిధ పార్టీల నుంచి టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

వైసీపీలో నాయకులకు విలువలేదు

» టీడీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ » దక్షిణ నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నేతలు తెలుగుదేశంలో చేరిక

మహారాణిపేట, ఏప్రిల్ 12: ముఖ్యమంత్రి జగన్ రాజకీయాలను భ్రష్టు పట్టించారని, ఆపార్టీలోని నాయకులకు కార్యకర్తలకు విలువ కల్పించడంలేదని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ సీతంరాజు సుధాకర్ అన్నారు. శుక్రవారంపార్టీ కార్యాలయంలో నిర్వహించిన దక్షిణ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున వివిధ రాజకీయ పార్టీల నాయ కులు , కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సం ద ర్భంగా సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ వైసీపీలో విలువలు లేవని, కార్యకర్తలకు గౌరవం లేదని అన్నారు. అలాగే, అందరూ సమష్టిగా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, ఎంపీ ఎం. శ్రీభరత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గండి బాబ్జీ మాట్లాడుతూ ఇసుక, మద్యం అమ్మకాలతో వచ్చే ఆదాయంతో సంక్షేమ పథకాల బటన్‌లు నొక్కుతున్నారన్నారు. ప్రతి ఒక్కరిపై రూ. నాలుగైదు లక్షల రూపాయలు ఉందన్నారు. మద్యం వి క్రయాల ద్వారా రూ. 1.30 లక్షల కోట్లు రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. టీడీపీకి అండగా నిలిచి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈసమా వేశంలో 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 35 వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, బుచ్చా రామిరెడ్డి, పోలుపల్లి జ్యోతి, చిన్న రహమాన్, పల్లా రాధ, కండిపల్లి సతీష్ కుమార్, చొల్లంగి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కళాశాలలో నిరాశాజనక ఫలితాలు

సీతమ్మధార, ఏప్రిల్ 12: సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్ ప్లాస్-2 బాలికల కళాశాలలో నిరాశ జనకమైన ఫలితాలు వచ్చాయి. మొత్తం ఎంపీసీలో 11 మంది, బైపీసీలో 7 మంది మొత్తం 18 మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. అయితే, ఎంపీసీ చదువుతున్న ఐదుగురు ఉతీర్ణత సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మంచిమార్కులు సాధించిన విద్యార్థులకు అభినందించారు.

బుల్లయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

డాక్టర్ లంకపల్లి బుల్లయ్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో మొత్తం 765 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 61.49 శాతం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉతీర్ణత సాధించారు. దీంతో ప్రిన్సిపాల్ కె. సోమేశ్వరరెడ్డి, అధ్యాపకులు విద్యార్థులకు అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని వారు ఈసందర్భంగా పేర్కొన్నారు.

వైసీపీ పాలన నుంచి ప్రజలను కాపాడుతాం

» ఉత్తర నియోజకవర్గ కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు


46వ వార్డు శాంతినగర్‌లో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 12: వైసీపీ దుర్మార్గ పాలన నుంచి ప్రజలను కాపాడేందుకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఎంతో శ్రమిస్తోందని ఉత్తర నియోజకరవర్గం ఉమ్మడి అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. గ్రేటర్ 46వ వార్డు శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మోపుతున్న అనేక రకాల పన్నులతో రా ష్ట్రంలో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇవన్నీ తొలగిపోవాలంటే కేంద్రంలో మోదీ ప్రధానిగా, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండాలన్నారు. కేం ద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వైసీపీ తమవిగా ప్రచారం చేసుకుంటోందన్నారు. ఈ ప్రజలను అనేక విధాలుగా మోసగిస్తోందన్నారు. రాష్ట్రంలో అవినీతి, అ క్రమాలు పెచ్చుమీరిపోయాయన్నారు. అందుకోసం ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను గుర్తు కమలంపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు బీజేపీ, టీడీపీ అధ్యక్షులు గార ఈశ్వరరావు, పుక్కళ్ల పైడికొండ, 26వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కేవీ కుమార్, మాజీ టీడీపీ అధ్యక్షుడు ఆవాల నారాయణ స్వామి, విశాఖ పార్లమెంటరీ తెలుగు మహిళా కార్యదర్శి యాగాటి ఆదిలక్ష్మి, నాయకులు కొప్పిశెట్టి శంకరరావు, గొలగాని సౌజన్య, ఈతలపాక సుజాత, తోట శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సపర్యలు


గాయపడిన వ్యక్తిని పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

కంచరపాలెం, ఏప్రిల్ 12: జై భారత్ పార్టీ అధ్యక్షుడు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మానవత్వం చాటు కున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి వైద్యసాయం అందించడంలో తోడ్పాటు నందించారు. వివరాలివి.. కంచరపాలెం సన్‌రైజ్ క్లబ్ సమీపంలో జాతీయ రహదారిని దాటుతుండగా ఓ వృద్ధుడిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఆయనకు తలకు గాయమై కింద పడిపోయాడు. దీంతో పలువురు వాహనదారులు క్షతగాత్రుడిని రోడ్డు పక్క పుట్‌పాత్‌పై ఉంచారు. ఇంతలో ఎన్నికల ప్రచారం కోసం కంచరపాలెం ఊర్వశి జంక్షన్ మీదుగా జాతీయ రహదారిలో తన వాహనంలో వెళ్తున్న లక్ష్మీనారాయణ గుర్తించి తన వాహనాన్ని పక్కకు నిలిపి నేరుగా క్షతగాత్రుడి వద్దకు వచ్చి ఆయనకు ధైర్యం చెప్పారు. ఏమీ కాదంటూ 108 వాహనానికి ఫోన్ చేసి అంబులెన్స్ వచ్చినంత వరకు నిరీక్షించి బాధితుడిని తరలించారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తి అధైర్య పడకుండా చెప్పడంతో పాటు పావుగంట వరకు బాధితునితో మాట్లాడారు.

‘మెడికల్’పై కమర్షియల్ శాఖ ఘన విజయం


నరేంద్రకు ప్లెయిర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందజేస్తున్న అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 12: వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజనల్ అంతర్ శాఖల క్రికెట్ టోర్నీలో భాగంగా శుక్రవారం రైల్వే గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో కమర్షియల్ శాఖ 121 పరుగుల భారీ తేడాతో మెడికల్ విభాగంపై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కమర్షియల్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లకు 159 పరుగులు చేసింది. కెప్టెన్ డి.నరేంద్రకుమార్ అజేయ అర్ధ సెంచరీతో (60) రిటైర్డ్ కాగా, ఎం.కృష్ణంరాజు (43), లోకేష్ (19 నాటౌట్) రాణించారు. లక్ష్య ఛేదనలో మెడికల్ శాఖ పేలవమైన బ్యాటింగ్‌తో కేవలం 38 పరుగులకు ఆలౌటై భారీ తేడాతో ఓటమి పాలైంది. ఒక్క బ్యాటర్ కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. కమర్షియల్ బౌలర్లలో వైవీ.శశి, రాంకిషోర్, శ్యామ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అర్ధ సెంచరీ చేసిన నరేంద్ర ప్లెయిర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. మరో మ్యాచ్‌లో ఆఫీసర్స్ ఎలెవెన్ ఎనిమిది వికెట్ల తేడాతో కన్‌స్ట్రక్షన్‌పై విజయం సాధించింది. తొలి బ్యాటింగ్ చేసిన కన్‌స్ట్రక్షన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 110 పరుగులు చేయగా, ఆఫీసర్స్ ఎలెవెన్ 12.5 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో కెప్టెన్ అవినాష్ అజేయ హాఫ్ సెంచరీ (55), అశోక్ (24 నాటౌట్) రాణించి జట్టుకు సునాయాస విజయాన్నందించారు.

విశాఖ, కొల్లాం ప్రత్యేక వారాంతపు రైలు

» దువ్వాడ మీదుగా మరికొన్ని ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 12: వేసవి రద్దీని దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, కొల్లాం మధ్య ప్రత్యేక వారాంతపు రైలుతోపాటు వయా విశాఖ, దువ్వాడ మీదుగా మరికొన్ని ప్రత్యేక వారాంతపు రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 08539 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి జూలై 3వతేదీ వరకు ప్రతి బుధవారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుతుంది. తిరిగి ఈనెల 18 నుంచి జూలై 4వతేదీ వరకు ప్రతి గురువారం రాత్రి 7.35కు కొల్లాంలో బయలుదేరి మర్నాడు అర్ధరాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుతుంది.

న్యూ టిన్సుకియా-బెంగళూరు-న్యూ టిన్సుకియా వయా విశాఖ

05952 నంబరు గల రైలు మే రెండు జూన్ 27 వరకు ప్రతి గురువారం సాయంత్రం 6.45 గంటలకు న్యూ టిన్సుకియాలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ, మర్నాడు (మూడోరోజు) ఉదయం 9.00 గంటలకు ఎస్‌ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరిగి మే ఆరు నుంచి జూలై ఒకటో తేదీ వరకు ప్రతి సోమవారం ఉదయం 00.30 (ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటలకు) ఎస్‌ఎంవీ బెంగళూరులో బయలుదేరి మర్నాడు రాత్రి 9.40 గంటలకు విశాఖ, బుధవారం మధ్యాహ్నం 1.15 గంటలకు న్యూ టిన్సుకియా చేరుతుంది.

భువనేశ్వర్-యలహంక-భువనేశ్వర్ వయా దువ్వాడ

02811 నంబరు గల ప్రత్యేక ఏసీ రైలు ఈనెల 13 నుంచి మే 25 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 1.53 గంటలకు దువ్వాడ, అర్ధరాత్రి 11.55 గంటలకు యలహంక చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల 15 నుంచి మే 27 వరకు ప్రతి సోమవారం ఉదయం 5.00 గంటలకు మర్నాడు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది.ఈ సర్వీసులు 16 థర్డ్ ఏసీ కోచ్‌లతో కుర్దా రోడ్డు, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, నంద్యాల, ధోనే, ధర్మవరం, సత్యసాయి ప్రశాంతి నిలయం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

హౌరా-యశ్వంతపూర్-హౌరా వయా దువ్వాడ

02863 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 18 నుంచి జూన్ 27 వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 12.40 గంటలకు హౌరాలో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 2.43 గంటలకు దువ్వాడ, అర్ధరాత్రి 12.15 (తెల్లవారితే శనివారం) గంటలకు యశ్వంతపూర్ చేరుతుంది. తిరిగి ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 5.00 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి అర్ధరాత్రి 11.05 గంటలకు దువ్వాడ, మర్నాడు (ఆదివారం) మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరా చేరుతుంది.

పుట్‌పాత్‌ల ఆక్రమణలు.. పాదచారులకు అవస్థలు

» కంచరపాలెం మెయిన్ రోడ్డుకు ఇరువైపులా సమస్య

కంచరపాలెం, ఏప్రిల్ 12 : కంచరపాలెం మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అసలే నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే మెట్టు నుంచి ఊర్వశి జంక్షన్ రోడ్డులో పాదచారులకు నడిచే మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. పుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. వివిధ సామగ్రి, దుకాణాలతో నిండిపోతుండడంతో పాదచారులు ప్రధాన రోడ్డుపైనే నడవాల్సి వస్తోంది. ఫలితంగా నిత్యం పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మెట్టు బస్టాప్ దగ్గర నేతాజీ క్లబ్‌ను ఆనుకుని ఉన్న దుకాణాల వద్ద పరిస్థితి మరీదారుణంగా మారింది. ఇక్కడ పుట్‌పాత్‌పై పూర్తిగా శీతలపానీయాల దుకాణాలు పెట్టి దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారు. పుట్‌పాత్‌లపై దుకాణాలకు కొందరు అద్దెలు వసూలు చేసి సొమ్ములు చేసుకుంటున్నారు. ఏదిఏమైనా పాదచారులుకు ప్రమాదాల జరగకుండా ఏర్పాటు చేసిన


పుట్‌పాత్‌లపై దుకాణాలు

పుట్‌పాత్‌లు ఇలా చిల్లర వ్యాపారులతో ఆక్రమణకు గురికావడంపై ప్రజలు ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ, పోలీస్ అధికారులు చర్యలు చేపట్టి ఆక్రమణలకు తొలగించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు

వైసీపీ నేతలకు డిపాజిట్లు దక్కవు

» ట్విట్టర్‌లో వైవీ సుబ్బారెడ్డి విమర్శలపై గంటా ధ్వజం



విశాఖపట్నం, ఏప్రిల్ 12: తాను నియోజకవర్గం మారడం, అభివృద్ధి తదితర అంశాలపై రాజ్యసభసభ్యుడు, వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని, వారి పార్టీలోనే ఎంతమంది ఎమ్మెల్యేలను స్థానాలు మార్చి పోటీ చేయిస్తున్నారో ఆయనకు తెలియదా.. అని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్ వేదికగా నిలదీశారు. వైసీపీ నేతలు ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తే వారికి డిపాజిట్లు రాకుండా ఘోర ఓటమి పాలవుతారని హెచ్చరించారు. ఎవరు ఎక్కడ నుంచి పోటీ చేస్తున్నారన్నది సమస్యకాదని, ప్రజలకు ఎంతవరకు సేవచేస్తున్నాం.. మనల్ని గెలిపించిన ప్రాంతాన్ని ఏమేరకు అభివృద్ధి చేశామన్నదే ముఖ్యమన్నారు. 2014లో తాను భీమిలి నుంచి పోటీ చేశానని, అది పార్టీ అధిష్ఠానం నిర్ణయంతో జరిగిందని, 2019లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తనను విశాఖ నార్త్ నుంచి పోటీ చేయాలని ఆదేశించడంతో అక్కడ నుంచి పోటీ చేసి విజయం సాధించినట్టు తెలిపారు. ఈ ఎన్నికల్లో పొత్తులో భాగంగా విశాఖ నార్త్ స్థానాన్ని బీజేపీకి కేటాయించడం, తనకు భీమిలి కేటాయించినట్టు పేర్కొన్నారు. రాజకీయ పరిస్థితుల్లో ఎన్ని జరిగినా తాను భీమిలిని ఎంత అభివృద్ధి చేశానన్నది ప్రజలందరికీ తెలుసునని, ఇక్కడ ఎన్నికల ప్రచారాల్లో ఆ నియోజకవర్గ ప్రజల నుంచి వచ్చిన స్పందన చూస్తే ఈవిషయం అర్థమవుతుందని పేర్కొన్నారు. మండల, గ్రామ స్థాయి వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారని, ఇది భీమిలి నియోజకవర్గ ప్రజలకు టీడీపీపై ఉన్న అభిమానమని పేర్కొన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానని ఆయన గుర్తు చేశారు. విశాఖను రాజధానిగా చేస్తామని ప్రకటించి దీన్ని అభివృద్ధి చేయకపోగా, ఇక్కడి భూములు జగన్మోహన్ రెడ్డి అండతో కబ్జాలు చేయలేదా అని గంటా ప్రశ్నించారు.

ఇంటర్‌లో బాలికల హవా

... 5వ పేజీ తరువాయి

హాజరుకాగా 30,050 మంది (77 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 20,745 మందికి 15,858 మంది (76 శాతం), బాలికలు 18,073 మందికి 14,192 మంది (79 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 34,672 మంది పరీక్షలు రాయగా 29,258 మంది (84 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 18,436 మందికి 15,392 (83 శాతం), బాలికలు 16,236 మందికి 13,866 మంది (85 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్..ప్రథమ ఏడాది 1,431 మంది పరీక్షలు రాయగా 968 మంది (68 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 451 మందికి 209 మంది (46 శాతం), బాలికలు 980 మందికి 759 మంది (77 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఏడాది 1,307 మంది పరీక్షలకు హాజరవ్వగా 1041 మంది (80 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 393 మందికి 263 మంది (67 శాతం), బాలికలు 914 మందికి 778 మంది (85 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

చతికిలపడ్డ ప్రభుత్వ కళాశాలలు

... 5వ పేజీ తరువాయి

ఫలితాలు రాలేదు. జిల్లాలో ఆనందపురం, పద్మనాభం, భీమిలి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఫలితాలు కొంతమేర పర్వాలేదనిపించాయి. మూడుచోట్ల కలిపి ప్రథమ ఏడాదిలో 94కి 60, ద్వితీయ ఏడాదిలో 90కి 53 మంది ఉత్తీర్ణత సాధించారు. సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలల్లో ప్రథమ ఏడాదిలో 155కి 110 మంది (70.38), ద్వితీయ ఏడాది 173కి 135 (78.06 శాతం) మంది పాసయ్యారు. గిరిజన సంక్షేమ శాఖలో ప్రథమ ఏడాది 79కి 78 మంది (98.7శాతం), ద్వితీయ ఏడాది 81కి 78 మంది(96 శాతం), బీసీ వెల్ఫేర్‌లో ప్రథమ ఏడాది 92కి 81 మంది (88.04 శాతం), ద్వితీయ ఏడాదిలో 79కి 74కి (93.67 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు కళాశాలల విషయానికి వస్తే ప్రథమ సంవత్సరం 35,897 మంది పరీక్షలు రాయగా 28,778 (80.16 శాతం) మంది, ద్వితీయ సంవత్సరం 32,267కి 27,944 (86.6 శాతం) మంది పాసయ్యారు.

వైసీపీ టోకెన్లు

... 5వ పేజీ తరువాయి

మరోసారి వచ్చి డబ్బులు ఇస్తామని ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఎక్కడా నగదుగానీ, బహుమతులుగానీ నేరుగా పంచడం లేదు కాబట్టి ఎంసీసీ బృందాలు కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండడం లేదని అధికారులు చెబుతున్నారు. నగరంలో కేవలం వైసీపీ నేతలు మాత్రమే ఈ తరహా టోకెన్లు పంపిణీ చేస్తున్నారు.

రాగి పిండి కొనుగోలుకు కార్డుదారులు విముఖం

... 5వ పేజీ తరువాయి

ఎక్కువగా నిల్వలు ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నెలకు సంబంధించి రాగిపిండి కొనుగోలు చేయలేమని డీలర్లు చెప్పినా..పౌర సరఫరాల శాఖ అధికారుల నుంచి ఒత్తిడి వచ్చింది. జిల్లాలో డీలర్లకు 123.166 టన్నుల రాగిపిండి అందజేశారు. దీంతో డీలర్లు బియ్యం కోసం వచ్చే కార్డుదారులకు నచ్చజెప్పి కిలో చొప్పున ఇచ్చారు. జిల్లాలో 5.29 లక్షల కార్డుదారులు ఉండగా గురువారం నాటికి 60,414 మందికి (14.2 శాతం) 60.37 టన్నులు రాగి పిండి విక్రయించారు. ఇంకా రేషన్ డిపోల్లో మరో 60 టన్నుల వరకూ సరకు ఉంది. ఈ నెలకు సంబంధించి 18వ తేదీ వరకు సరకులు పంపిణీకి సమయం ఉంది. అయినా మొత్తం సరకు అమ్మలేమని డీలర్లు అంటున్నారు. కాగా, మార్చి నెలలో సరఫరా చేసిన వంద టన్నుల్లో మిగిలిపోయిన పిండిని ఈ నెలాఖరులోగా విక్రయించాలి. అలాగే ఈనెల వచ్చిన పిండిని వచ్చే నెలాఖరులోగా కార్డుదారులకు సరఫరా చేసేయాలి. లేనిపక్షంలో రాగిపిండి ఎందుకూ పనికిరాకుండా పోతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కిలో బియ్యం తగ్గిస్తామనడం వల్లే కార్డుదారులు ముందుకురావడం లేదని పలువురు వ్యాఖ్యానించారు. సాధారణంగా ఎక్కువ మంది కార్డుదారులు బియ్యం బయట అమ్ముకుంటారు. రాగిపిండి వల్ల ఒక కిలో సొమ్ము కోల్పోవలసి వస్తోందని గాజువాకకు చెందిన కార్డుదారుడొకరు అభిప్రాయపడ్డారు. దీనిపై జిల్లా పౌర సరఫరాల అధికారి గూన సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రతి కార్డుదారుడు రాగిపిండి కొనుగోలు చేసేలా నచ్చజెప్పాలని ఎండీయూలకు సూచించామన్నారు.

ఆదాయ శాఖలకూ మినహాయింపు లేదా!?

... 5వ పేజీ తరువాయి

తప్పించుకోవడానికి రకరకాలు ఎత్తుగడలు వేస్తున్నారు. ఆరోగ్యం బాగా లేదని కొందరు, తండ్రికి సీరియస్‌గా ఉందని మరికొందరు, తల్లికి ఆపరేషన్ అయిందని మహిళలు, డయాలసిస్ చేయించుకోవాలని పలువురు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని కోరుతున్నారు. ఇక్కడ కూడా రాజకీయ సిఫారసులు ఉన్నవారికే మినహాయింపు లభిస్తోంది. మిగిలిన వారికి డ్యూటీ చేయాల్సిందేనని స్పష్టంచేస్తున్నారు. ఇలా మినహాయింపులు తీసుకునేవారి సంఖ్య పెరుగుతుండడం వల్ల ఆదాయం తెచ్చే శాఖల సిబ్బందికి కూడా ముందుచూపుతో శిక్షణ ఇవ్వాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు.

ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళతాం

ఏపీ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం

కేంద్ర ఎన్నికల పరిశీలకుడిని కలవడానికి విశాఖపట్నం వచ్చిన ఎల్‌వీ సుబ్రహ్మణ్యం నోవాటెల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ శాఖల అంశాన్ని ప్రస్తావించారు. ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, దేవదాయ శాఖల సిబ్బందిని కూడా ఎన్నికల విధులకు వేస్తున్నట్టు తమకు ఫిర్యాదులు అందాయని, వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

సాహితీ ఫార్మా ప్రమాదంపై గూడుపుఠాణి

... 5వ పేజీ తరువాయి

పిటిషన్ వేసింది. ప్రమాదం జరిగినప్పుడు వారికి సరైన పరిహారం కూడా ఇవ్వడం లేదని వాదించింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులతో ఒక కమిటీని వేసినా ఇప్పటివరకు ఆ కమిటీ ప్రమాదానికి కారణాలు వెల్లడించలేదని, ఇది చాలా అన్యాయమని శాస్త్రవేత్త బాబూరావు ఆరోపిస్తున్నారు. ఆ ప్రమాదం తరువాత ఉమ్మడి విశాఖ జిల్లాలో మరో నాలుగు ప్రమాదాలు జరగడం గమనార్హం.

సాహితీ ఫార్మాలో రియాక్టర్ పేలడం వల్లే ప్రమాదం జరిగిందని జిల్లా అధికారులు చెబుతున్నారు. దీనిని ప్రజా శాస్త్రవేత్తల బృందం తీవ్రంగా ఖండిస్తోంది. రసాయనాలను శుద్ధి చేసే సాహితీ ఫార్మాలో రియాక్టర్లు ఉండవని, రసాయనాలను వేడి చేయడానికి ఉపయోగించే రీబాయిలర్‌లో ప్రమాదం జరిగిందని పేర్కొంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదించింది. సాహితీ ఫార్మాలో అంతకు ముందు కూడా ఒకసారి ప్రమాదం జరిగిందని, అయినా ఆ సంస్థ యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోలేదని ఎన్‌జీటీకి వివరించారు. ఈ ప్రమాదంపై అనకాపల్లి కలెక్టర్, ఫ్యాక్టరీస్ డైరక్టర్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన నివేదిక అందిందని, అయితే నిపుణులతో కూడిన కమిటీని కూడా నియమించారని, ఆ కమిటీ ఇంకా నివేదిక ఇవ్వకపోవడం దారుణమని శాస్త్రవేత్త బాబూరావు ఆరోపించారు. తక్షణమే ఈ కేసులో బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేందుకు జిల్లా అధికారులు సహకరించాలని ఆయన కోరారు.



తులసీ దళాల నడుమ స్వామివారు

అప్పన్నకు తులసీ దళార్చన

సింహాచలం, ఏప్రిల్ 12 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం సహస్రనామ తులసీ దళార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకవేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన చేశారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిత్య కల్యాణం జరిపారు.

కాంగ్రెస్ నాయకుల సమావేశం

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 12 : నియోజకవర్గంలో మొదటిసారిగా స్థానిక అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఎన్నికల్లో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ భీమిలి అభ్యర్థి ఏవీ వర్మ కోరారు. శుక్రవారం ఆయన తాళ్లవలస గ్రామంలో ఆ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి గత కొన్నేళ్లుగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులే పెత్తనం చెలాయిస్తున్నారని, దీన్ని ఈ ఎన్నికల్లో బ్రేక్ చేయాలని కోరారు. టీడీపీ, వైసీపీ నాయకులు ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు. సమావేశంలో 3, 4వ వార్డుల అధ్యక్షులు పి. రాజు, రజనీకాంత్, రమణ, కేశవరావు పాల్గొన్నారు.

వైసీపీలోనే ఉంటాను : భీమిలి ఎంపీపీ

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 12 : తాను వైసీపీలోనే ఉంటానని భీమిలి ఎంపీపీ డీవీ సూర్యనారాయణ రాజు స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం ఆయన వైసీపీకి, ఎంపీపీ పదవికి రాజీనామా చేసినట్టు విషయం తెలిసిందే. తన రాజీనామాను వెనక్కి తీసుకుంటున్నట్టు శుక్రవారం ఆయన ప్రకటించారు. మనస్తాపంతో ఆవిధంగా ప్రకటించానన్నారు. ఈమేరకు మధురవాడలో జరిగిన వైసీపీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తనను వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కలిసి పార్టీని గెలిపించాల్సిన తరుణంలో రాజీనామా చేయడం సరికాదని, ఏమైనా ఉంటే అంతర్గతంగా మాట్లాడుకుందామని చెప్పడంతో రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు చెప్పారు.

16న పద్మనాభం మండల సమావేశం

పద్మనాభం, ఏప్రిల్ 12 : పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16న మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్టు ఎంపీడీఓ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి అధికారులు, సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం



సాగర్‌నగర్, ఏప్రిల్ 12 : రుషికొండ బీచ్‌లో గల్లంతైన బీటెక్ విద్యార్థి తేజ (20)మృతదేహం శుక్రవారం లభ్యమైంది. కంచరపాలెం ఊర్వశి జంక్షన్ ప్రాంతానికి చెందిన తేజ ఐదుగురు స్నేహితులతో కలిసి గురువారం సాయంత్రం రుషికొండ బీచ్‌కు విహారానికి వచ్చి సముద్ర స్నానాలకు దిగి గల్లంతైన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన ప్రాంతానికి కాస్త దూరంలోనే మృతదేహం లభ్యమైంది. ఆరిలోవ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** గోకుల్, శ్రీకన్య, మౌర్య (గోపాలపట్నం) హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **లవ్ గురు :** శారద, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **శ్రీరంగనీతులు** : కిన్నెర, శ్రీ నరసింహ (గోపాలపట్నం),
- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), శ్రీకన్య-1, హెవెన్, సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి),
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి,
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 20, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారెట్ 30, దొండకాయలు 20, బంగాళా దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 148, బరబటి 24, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 28, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 110, పొటల్స్ 64, కీరదోస 20, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 45, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	411
విజయనగరం	415
శ్రీకాకుళం	415

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 115
ఫారం ధర	-- 135
విత్ స్కిన్	-- 240
స్కిన్‌లెస్	-- 250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..

ఇంటర్ ఫలితాల్లో 'గురుకులం' ప్రతిభ

- గతంలో కంటే మెరుగైన ఫలితాలు
- పలువురికి 900కి పైగా మార్కులు



సాయికావ్య 964, వెంకటలక్ష్మి 419, మోదక ప్రియ 452, శ్రీవిద్య 946, నిరంజన్ 966, ప్రవీణ్ 974

భీమునిపట్నం, ఏప్రిల్ 12 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని గురుకుల పాఠశాలలు, కేజీబీవీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. భీమిలిలోని గొల్లలపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బైపీసీకి చెందిన ఇద్దరు విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ గంగా కుమారి తెలిపారు. మొదటి సంవత్సరంలో బర్నికాని వెంకటలక్ష్మి 419/440 మార్కులు సాధించగా ద్వితీయ సంవత్సరం విద్యార్థిని నిటిపల్లి సాయికావ్య 964 మార్కులు సాధించినట్టు తెలిపారు. బాలికలను సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాస్, జిల్లా జీసీడీవో కలిషా బేగం, తదితరులు అభినందించారు.

జీజేసీలో 44.44 శాతం ఉత్తీర్ణత

భీమిలి ప్రభుత్వ జూనియరు కళాశాల విద్యార్థులు 44.44 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ సూర్య ప్రసాద్ తెలిపారు. 117 మంది పరీక్షలకు హాజరు కాగా 52 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. వృత్తి విద్యా కోర్సుల్లో 158 మంది పరీక్షలకు హాజరుకాగా 136 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు.ఎంపీసీలో ఎస్. కిరణ్మయి 906, బైపీసీలో నాయుడమ్మ 951, సీఈసీలో ఎం.శంకర్ 850, హెచ్ఈసీలో ఎర్రప్పన్న 929 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమంగా నిలిచారన్నారు.ఒకేషనల్ కోర్సుల్లో ఎఅండ్‌టీలో కె. సంధ్య 950, ఓఏఎస్‌లో వాసవి 900, ఈటిలో బి. వినయ్‌కుమార్ 937, సీఎస్ఈలో వి. శ్యామల 819, ఎంఎల్‌టీలో వి.సతీష్ 935, ఎంపీహెచ్‌డబ్ల్యూలో హేమలత 955 మార్కులు సాధించారన్నారు.

శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులం..

ఆరిలోవ : ఇంటర్ పరీక్షల్లో శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ వంకర రత్నవల్లి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 32 మంది పరీక్షలకు హాజరు కాగా 27 మంది ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో 21 మందికి 11 మంది పాసయ్యారు. ఎంపీసీలో పి. చక్రి 933 మార్కులు సాధించగా బైపీసీలో బి. ప్రవీణ్ 738 మార్కులు సాధించాడు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో 29 మంది పరీక్షలు రాయగా 19 మంది, బైపీసీలో 13 మందికి, 9 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో టి. రాజేష్‌కి 441 మార్కులు, బైపీసీలో విశాల్ రాజ్‌కు 416 మార్కులు వచ్చాయి.

కొమ్మాది : రిక్షా కాలనీలో ఉన్న అంబేడ్కర్ గురుకుల ప్రతిభా బాలికల కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ టి. నాగమణి తెలిపారు. మొదటి సంవత్సరంలో 80 శాతం, ద్వితీయ సంవత్సరంలో 93 శాతం ఉత్తీర్ణత పొందినట్టు చెప్పారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో ఎస్. మోదకప్రియా 452 మార్కులు సాధించగా ద్వితీయ సంవత్సరం బైపీసీలో కె.శ్రీవిద్య 946 మార్కులు సాధించినట్టు చెప్పారు.

సింహాచలం బీసీ గురుకులంలో..

సింహాచలం : సింహాచలంలోని మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ చూపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 94.87 శాతం, ప్రథమ ఇంటర్‌లో 89.01 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల ప్రధానాచార్యులు దాసరి సత్యారావు చెప్పారు. సీనియర్ ఇంటర్‌లో 39 మంది ఎంపీసీలో పరీక్షలకు హాజరు కాగా శత శాతం ఉత్తీర్ణులయ్యారు. బైపీసీ నుంచి 24 మంది హాజరుకాగా 22 మంది, సీఈసీ నుంచి 15 మందికి 13 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే జూనియర్ ఇంటర్‌లో 91 మంది హాజరు కాగా 81 మంది పాసయ్యారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో నిరంజన్‌కు 966 మార్కులు, బైపీసీలో యలమంచిలి పూర్ణ ప్రవీణ్‌కుమార్‌కు 974, సీఈసీలో పొట్నూరి సాయి ప్రకాశ్ 869 మార్కులు సాధించినట్టు చెప్పారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో బంటు కేశవ 449, జోగ జస్వంత్‌కు 449 మార్కులు వచ్చాయి.

పద్మనాభం కేజీబీవీలో 66 శాతం

పద్మనాభం : పద్మనాభంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 66 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ద్వితీయ ఇంటర్‌లో 32 మందికి 21 మంది ఉత్తీర్ణత, ప్రథమ ఇంటర్‌లో 29 మందికి 15 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఆనందపురం కళాశాలలో ఇద్దరే పాస్

విశాఖపట్నం : ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫలితాలు ఏమాత్రం మారలేదు. ప్రథమ ఏడాదిలో ఒకరు, ద్వితీయ ఏడాదిలో ఒకరు ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ ఏడాదిలో 14 మందికి 12మంది పరీక్షలకు హాజరు కాగా ఒకరు, ద్వితీయ ఏడాదిలో తొమ్మిది మందికి ఒకరు పాసయ్యారు. ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన జూనియర్ కళా శాలకు ఆనందపురం ఉన్నత పాఠశాలలో వసతి ఏర్పాటు చేశారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్ తప్ప అధ్యాపకులు లేకపోవడంతో అతిథి అధ్యాపకులతో బోధన చేస్తున్నారు. దీంతో కళాశాలలో ఫలితాలు తగ్గడమే తప్ప మెరుగుపడడం లేదు.



భీమిలి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు



పార్టీలో చేరిన భీమన్నదొరపాలెం సర్పంచ్, వార్డు సభ్యులతో గంటా

గెలుపు ఖాయం... మెజారిటీపైనే దృష్టి

- 18న నామినేషన్ దాఖలు
- టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఏప్రిల్ 12 : టీడీపీ అధిష్ఠానం తనకు టికెట్ ప్రకటించిన రోజునే గెలుపు ఖరారైందని, ప్రస్తుతం మెజారిటీపై దృష్టిపెడుతున్నానని ఆ పార్టీ భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం బీచ్‌రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో మూడు పార్టీల నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమిలిలో తాను పోటీ చేయాలని ప్రజలంతా కోరుకోవడం వల్లే ఎక్కడికి వెళ్లినా భారీ స్పందన లభిస్తుందన్నారు. మూడు పార్టీల సమన్వయంతో భారీ ఆధిక్యత సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, దీనికి తన సొంత ఎలక్షనీరింగ్ టీమ్ పనిచేస్తుందన్నారు. ఈనెల 18న నామినేషన్ దాఖలు చేయనున్నట్టు ప్రకటించారు. ఎన్నికల్లో నామినేషన్ ఘట్టం కీలకమైనదని, నియోజకవర్గంలో మూడు పార్టీల నాయకులు నామినేషన్ ఘట్టానికి అత్యధికంగా కార్యకర్తలను సమీకరించాలన్నారు. ఎన్నికల్లో నిలిచిన ప్రత్యర్థులు పోటీ నుంచి తప్పుకునేలా నామినేషన్ కార్యక్రమం ఉండాలని చెప్పారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, నాయకులు దంతులూరి అప్పలనరసింహరాజు, జనసేన, బీజేపీ నాయకులు ఈఎస్ఎస్ చంద్రరావు, కె. రామానాయుడు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

సాగర్‌నగర్ : రుషికొండకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు గంటా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి గంటా పార్టీ కార్యాలయంలో కండువాలు వేసి, టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీసీ సెల్ అధ్యక్షుడు ఎరుపల్లి లక్ష్మణ, ముగడ రాము, అప్పలరాజు, బి.కుమారి, వర్మ ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 8వ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, అక్కరబోయిన రాంబాబు, సారిపల్లి శ్రీనివాసరావు,గద్దిపల్లి అప్పారావు, వాసుపల్లి ధనరాజ్, కృష్ణ, గద్దిపల్లి అప్పన్న, చిన్న పాల్గొన్నారు.

భీమన్నదొరపాలెం సర్పంచ్ ..

ఆనందపురం : భీమన్నదొరపాలెం పంచాయతీ సర్పంచ్ బంటుకుమారి, వార్డు సభ్యులు సహా వంద మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



మధురవాడ : పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని చేతులు పైకెత్తి నినాదాలు చేయిస్తున్న ముత్తంశెట్టి

వలస నేతలను నమ్మొద్దు

- వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి
- మధురవాడలో ఎన్నికల కార్యాలయం

మధురవాడ, ఏప్రిల్ 12 : ఎన్నికల సమయంలో వచ్చి ఓట్లడిగే వలస నాయకులను ప్రజలు నమ్మొద్దని వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఏడో వార్డు కారుషెడ్ సమీపంలో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి వలస నాయకులు పోటీ చేస్తున్నారని, వారు చెప్పే మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టిన వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును మరో సారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే ఎంపీగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని కూడా ఎక్కువ మెజారిటీతో గెలిపించాలన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అభివృద్ధి అంటేనే వైసీపీ అన్నారు. ముఖ్యమంత్రి జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రజల మధ్య ఉంటూ చేసిన అభివృద్ధి, సేవలను గుర్తించి మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, 6వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక, తిప్పల నాగిరెడ్డి, పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి : ముత్తంశెట్టి

భీమునిపట్నం : ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీలక్ష్మిని ఎంపీగా గెలిపించాలని భీమిలి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం సాయంత్రం 4వ వార్డు కె. నగరపాలెం, రెడ్డిలపాలెంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. దళారీ వ్యవస్థ లేకుండా సుపరిపాలన అందించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని కొనియాడారు. మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపిస్తే, మరింత పారదర్శక పాలన అందిస్తామన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వార్డులో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, నాయకులు మేరుగు చిన్నారావు, పాల రమణారెడ్డి, మరుపిళ్ల చిన్నారావు, జగన్నాథ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'విలువలతో కూడుకున్నది న్యాయ విద్య'

మధురవాడ, ఏప్రిల్ 12 : విలువలతో కూడిన న్యాయ విద్యను అభ్యసించడం వల్ల సమాజంలో గౌరవప్రదంగా ఉంటుందని ఏసీపీ సీహెచ్ వివేకానంద అన్నారు. మధురవాడ ఎన్‌వీపీ న్యాయ కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ శాస్త్రం అభ్యసించిన విద్యార్థులు చట్టం, న్యాయం గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. కళాశాల ఛైర్మన్ ఎన్వీ రవీంద్ర మాట్లాడుతూ తమ కళాశాలలో న్యాయ విద్య అభ్యసించిన వారిలో అధిక శాతం మంది ఉన్నత శిఖరాలకు చేరుకోవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం ఏసీపీ వివేకానందను రవీంద్ర ఘనంగా సత్కరించారు.

ఘనంగా గాయత్రి కళాశాల వార్షికోత్సవం

కొమ్మాది, ఏప్రిల్ 12 : విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని కర్నూలు ఐఐఐటీ డీఎం ఆచార్య డీవీఎల్ఎన్ సోమయాజులు అన్నారు. శుక్రవారం ఆయన కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ అటానమస్ కళాశాల వార్షికోత్స వంలో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రావ్, గాయత్రి విద్యాపరిషత్ ఉపాధ్యక్షుడు దక్షిణామూర్తి,స్టూడెంట్స్ అఫైర్ డీన్ కృష్ణ సుబ్బారావు పాల్గొన్నారు.



సోమయాజులును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ఆనందపురంలో మాజీ సైనికుల సమావేశం

ఆనందపురం, ఏప్రిల్ 12 : మండలంలోని మాజీ సైనికులు శుక్రవారం ఆనందపురంలో సమావేశయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో దేశం కోసం పోరాటం చేశామని, పదవీ విరమణ చేసి చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. మాజీ సైనికుల సంఘాలు ఉన్నప్పటికీ ఇంతవరకు ఏ ఒక్క సంఘానికి కూడా కమ్యూనిటీ భవనం లేదని, సమస్యలను అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించిన వారికే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో విఘ్నేశ్వర ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు సాడి రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బూస రమణ, కార్యదర్శి చెన్నా నరసింగరావు, జాయింట్ సెక్రటరీ పల్లంటి జనార్దన్ పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 103 మంది ఎంపిక

సాగర్‌నగర్, ఏప్రిల్ 12 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసిస్తున్న 103 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ ఎస్. వంశీకిరణ్ సోమయాజులు తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ స్కూల్ విద్యార్థులకు ప్రముఖ కంపెనీలు ఫెడరల్ బ్యాంక్, డెలాయిట్, ఎసెంచూర్, ఆక్సెన్ పాట్నర్స్, జైడూస్ వెల్‌నెస్, బెర్గర్ పెయింట్స్, ఏసియస్ పెయింట్స్, విప్రో కన్సూమర్ కౌర్ తదితర సంస్థలు శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఇందులో 103 మంది రూ14. 25 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా కెరీర్ ఫుల్ ఫిల్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ వి. రవికుమార్ మాట్లాడుతూ మరికొన్ని బహుళజాతి సంస్థలు కూడా విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడానికి ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. విద్యార్థులకు కార్పొరేట్ సంస్థల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని గీతం వీసీ ప్రొఫెసర్ దయానందసిద్ధపట్టం, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు : కలెక్టర్

ఆరిలోవ, ఏప్రిల్ 12 : జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలని కలెక్టర్ డా. ఏ. మల్లికార్జున అన్నారు. శుక్రవారం ఆయన చినగదిలి తహసీల్దార్ కార్యాలయంలో జిల్లాలోని రాజకీయ నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలు, కొత్త ఓటర్ల నమోదు, ప్రచార ప్రక్రియపై చర్చించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం రాజకీయ నాయకులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో పలు పార్టీల నాయకులు కేవీ రమణ, రవి రెడ్డి, బి.రాజు, తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకముందు చినగదిలిలోని ఈవీఎంల గోదామును అధికారులు, రాజకీయ నాయకులు పరిశీలించారు. నిబంధనలు మేరకు వాటిని ఆయా నియోజకవర్గాలకు కేటాయించారు. డిజిటల్ విధానంలో ఈ ప్రక్రియ జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్, భీమిలి ఆర్‌డీఓ భాస్కరరెడ్డి, గాజువాక ఆర్‌డీఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ టీడీపీ : ఎమ్మెల్యే వెలగపూడి



మహిళలకు సూపర్ సిక్స్ కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 12 : తెలుగుదేశం పార్టీ అంటేనే అభివృద్ధికి చిరునామా అని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. శుక్రవారం ఆయన ఆదర్శనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వస్తే రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి, గెలిపించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, కాళ్ల శంకర్, పోతన్నరెడ్డి, వరలక్ష్మి, జీవిత, గోపమ్మ, మహేష్, నరేంద్ర పాల్గొన్నారు.

12, 13వ వార్డుల్లో..

ఆరిలోవ : వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, శ్రీభరత్‌ను ఎంపీగా గెలిపించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి 12,13 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం దృష్ట్యా తమ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి పోలారావు, వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవింద్, 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, నంబారు గోపి పాల్గొన్నారు.

జనసేనలోకి తూర్పు నియోజకవర్గం వైసీపీ ఎన్నికల పరిశీలకుడు సోదరుడు



వంశీకృష్ణ సమక్షంలో పార్టీలో చేరిన వెంకట నాగేశ్వరరావు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 12 : తూర్పు నియోజకవర్గం వైసీపీ పరిశీలకుడు, ఆ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, జిల్లా యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి మొల్లి అప్పారావు సోదరుడు మొల్లి వెంకట నాగేశ్వరరావు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. ఈమేరకు శివాజీపాలెంలో దక్షిణ నియోజకవర్గం జనసేన అభ్యర్థి వంశీకృష్ణ ఆయనకు కండువా వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ యాదవులపై వ్యవహరిస్తున్న తీరు నచ్చక పార్టీ మారినట్టు నాగేశ్వరరావు వెల్లడించారు. తూర్పులో టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు విజయానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు.

బంగారమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

సింహాచలం, ఏప్రిల్ 12 : అడివివరం, విజినిగిరిపాలెం, లండగరువు, తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్యదేవత బంగారమ్మ తల్లి ఆలయాన్ని రూ. 35 లక్షలతో నిర్మించనున్నారు. ఈమేరకు శుక్రవారం వేద పండితుల ప్రత్యేక పూజలు అనంతరం శంకువును స్థాపించారు. ఆలయ నిర్మాణానికి పాలకమండలి సభ్యులు ఏడాది క్రితమే ఆమోదం తెలిపారు. జూన్‌లో జరిగే అమ్మవారి పండుగ నాటికి ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

క్రీడాకారులకు అభినందనలు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 12 : తిరుపతిలో గత నెల నిర్వహించిన కేల్ ఇండియా సబ్ జూనియర్ విభాగంలో జరిగిన పోటీల్లో గొంప స్నేహ విజయ బంగారు, రజత పతకాలు సాధించింది. కోచ్ ఎం. వెంకటరావు ఆధ్వర్యంలోని బృందానికి తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం తన కార్యాలయంలో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొట్ట వెంకటరమణ, దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, సత్యం, రామకృష్ణ, ఆనంద్, గణేష్ పాల్గొన్నారు. అలాగే సీతమ్మధార ప్రాంతానికి చెందిన పుష్పాల భాను ప్రకాష్ నేపాల్‌లో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ అంతర్జాతీయ పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు. అతడ్ని కూడా ఎమ్మెల్యే అభినందించారు.

చిత్ర కళాకారుడు విజయ్‌కు సత్కారం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 12 : ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడం ఏయూ విధానమని వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఏయూ అంబేడ్కర్ ఛైర్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళలో వైవిధ్యాన్ని చూపుతూ, మిల్లెట్స్‌కి ప్రాచుర్యం తీసుకువస్తూ విజయ్‌కుమార్ చేస్తున్న కళాసేవ ఎంతో ప్రత్యేకమన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలు విశ్వజనీయమన్నారు. మిల్లెట్స్‌ను క్రమపద్ధతిలో అమర్చి అంబేడ్కర్ చిత్రపటాన్ని తీర్చిదిద్దిన విజయ్‌కుమార్‌ను అభినందించారు.

అలరించిన నాటక ప్రదర్శనలు

మద్దిలపాలెం, ఏప్రిల్ 12 : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన నాటక ప్రదర్శనలు అలరించాయి. పైడా కౌశిక్ నాటకోత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వప్నం రాల్చిన అమృతం, పక్కింటి మొగుడు నాటకాలు ప్రదర్శించారు. కాకుల్లో లేని జ్ఞానం మనుషుల్లో ఉండకపోతే ఎలా అన్న సందేశంతో స్వప్నం రాల్చిన అమృతం, అవసరాలకు అనుగుణంగా ఎదుటవారికి బ్లాక్ మెయిల్ చేస్తే ఎదురయ్యే ఇబ్బందుల సందేశంతో పక్కింటి మొగుడు నాటకాలను ప్రదర్శించారు.

హోం ఓటింగ్‌పై అవగాహన అవసరం

సిరిపురం, ఏప్రిల్ 12 : హోం ఓటింగ్ విధానంపై ఎన్నికల సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ అన్నారు. శుక్రవారం ఆయన తూర్పు నియోజకవర్గంలోని సెక్టోరల్, రూట్ ఆఫీసర్లు, బీఎల్ ఓలకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో హోం ఓటింగ్ విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోం ఓటింగ్‌పై తొలి నుంచి చివరి వరకు జరిగే అన్ని ప్రక్రియలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.